శుక్రవారం
29-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 68
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇస్కాన్‌పై నిషేధానికి బంగ్లాదేశ్ హైకోర్టు తిరస్కృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ కార్యకలాపాలపై నిషేధం విధించేందుకు అక్కడి హైకోర్టు తిరస్కరించింది. ఇస్కాన్ గురువు చిన్మయ్ కృష్ణదాస్ ప్రభు అరెస్టు క్రమంలో ఉద్రిక్తతల క్రమంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలన్న పిటిషన్‌ను గురువారం కొట్టివేసింది. ఇస్కాన్ కార్యకలాపాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో నివేదిక ఇవ్వాలని అటార్నీ జనరల్‌ను ఆదేశించింది. ఇదిలావుంటే కృష్ణ దాస్ ప్రభుత్వ బెయిల్ పిటిషన్‌ను చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. భారత్ ఖండన: కృష్ణదాస్ ప్రభుత్వ అరెస్టు, ఆయనకు బెయిల్ నిరాకరణను భారత్ ఖండించింది. హిందువులు, మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ అధికారులను కోరినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

మోదీకి బెదిరింపు ఫోన్ కాల్

ముంబై: ప్రముఖులపై బెదిరింపులకు పాల్పడుతూ ముంబై ట్రాఫిక్ పోలీసులకు వరుస ఫోన్ కాల్స్ రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా గురువారం మరో కాల్ వచ్చింది. ఈసారి ఏకంగా ప్రధాని నరేంద్రమోదీపై బెదిరింపులకు పాల్పడటంతో పోలీసులు అప్రమ త్తమయ్యారు. ముంబై ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు గురు వారం ఉదయం ఓ బెదిరింపు కాల్ వచ్చింది. ప్రధాని మోదీని హత్య చేసేందుకు పథకం వేసినట్లు ఓ మహిళ బెదిరించారు. అందుకు

- మిగతా 2 లో

4న ఏపీ కేబినెట్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం డిసెంబర్ 4న సమావేశం కానుంది. వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం తెలిపారు. కేబినెట్‌లో చర్చించాల్సిన ప్రతిపాదనలను డిసెంబర్ 2లోగా పంపాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, కొత్త పథకాలు, ఇసుక విధానం అమలులో లోటుపాట్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, అమరావతి మాస్టర్‌ప్లాన్ సహా కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

అమరావతిలో ఈగల్ కేంద్ర కార్యాలయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాదకద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటైన 'ఈగల్' ఫోర్స్‌కు రూ.8.59 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో ఈగల్ కేంద్ర కార్యాలయం, జిల్లాల్లో శాఖా కార్యాలయాలు ఏర్పాటు చేసింది. ఇందులో అమరావతిలో నార్కోటిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు 26 జిల్లాల్లో నార్కోటిక్ సెల్స్ ఉన్నాయి. మత్తు పదార్థాల సరఫరా, రవాణా నియంత్రణకు

- మిగతా 2 లో

ప్రక్షాళన అవసరం

- విద్యార్థులతోనే నిజాయతీ రాజకీయాలు
- అవినీతి, కుంభకోణాలపై పోరు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలో రామకృష్ణ

విశాలాంధ్ర-విజయనగరం: ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు సమాజంలోని మంచిచెడులు, రాజకీయాలు పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. దేశంలో కుంభకోణాలు, లంచగొండితనం, అవినీతి విచ్చలవిడిగా పెరిగాయని, ఇలాంటి రుగ్మతల నుంచి దేశాన్ని కాపాడటానికి విద్యార్థులు, యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కుంభకోణాలు చేసేవారు, లంచగొండులు, అవినీతిపరులు, దుర్మార్గులు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. యువకులు, విద్యార్థుల వల్లే నిజాయతీ రాజకీయాలు ఉంటాయని చెప్పారు. విజయనగరంలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రామకృష్ణ గురువారం మాట్లాడారు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలలో పాల్గొన్నదని, ఏఐఎస్ఎఫ్‌లో పనిచేసిన అనేకమంది రాష్ట్ర, జాతీయస్థాయిలలో అనేక పదవులు చేపట్టారని గుర్తుచేసారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని నాయకులు నేడు పాలన సాగిస్తున్నారని పరోక్షంగా బీజేపీని విమర్శించారు. మోదీ పాలనలో దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉందని, విద్యార్థులు ఈ విషయం గమనించాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రూపుమాపాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. కులాలు, మతాల మధ్య చిచ్చురేపుతున్నాయని, మతోన్మాద శక్తులకు అలాంటి అవకాశం ఇవ్వరాదని సూచించారు. అనేకభాషలు, మతాలు, కులాలు, సంస్కృతుల మేళవింపే భారతదేశమని ఉద్ఘాటించారు. దేశ ప్రజలంతా సామరస్యంగా జీవిస్తున్నారంటే... అందుకు ప్రధాన కారణం రాజ్యాంగమేనని రామకృష్ణ స్పష్టం చేశారు. దేశంలో 18 కోట్ల మంది ముస్లింలు ఉన్నప్పటికీ బీజేపీ మాత్రం ఒక్క ముస్లింకు కూడా ఎంపీ టికెట్ ఇవ్వలేదని, మంత్రివర్గంలో స్థానమే లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం సాగిస్తోందని చెప్పారు.

చంద్రబాబు, పవన్‌పై వ్యంగ్యాస్త్రాలు

ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పైనా రామకృష్ణ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాడు చే గువేరా అన్న పవన్ కల్యాణ్... నేడు సనాతన ధర్మమంటూ ప్రకటనలు చేస్తున్నారని, ఇది ఆయన సొంత నినాదం కాదని, బీజేపీ ఆడిస్తున్న నాటకమన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా ఉన్నారని, రాష్ట్రంలో పాలన బీజేపీ చెప్పినట్లు సాగుతోందని విమర్శించారు. సనాతన ధర్మ నినాదం కూడా బీజేపీదేనన్నారు. కులాలను, మతాలను విడదీయడం, వివక్ష కొనసాగించడం సనాతన ధర్మం లక్ష్యమని చెప్పారు. ఒకవైపు పవన్ కల్యాణ్ సనాతన ధర్మమంటుంటే... మరోవైపు పూర్తిగా బట్టలూడదీసుకుని తిరుగుతున్న ఓ అఘోరా కూడా సనాతన ధర్మమని చెప్పుకోవడం విచిత్రంగా ఉందన్నారు. చంద్రబాబులో రెండు పార్శ్వాలు కనిపిస్తాయని, అధికారం రాకముందు సాధారణంగా ఉంటారని, అధికారం చేపట్టాక ఆయన తీరు మారిపోతుందని విమర్శించారు. అన్ని శాఖలలో వేలు పెడుతున్న విద్యాశాఖ మంత్రి లోకేశ్... తన సొంత శాఖలో లోపాలు మాత్రం సరిచేయడం లేదని ఎద్దేవా చేశారు. ఉన్నత విద్యాశాఖకు చైర్మన్ లేరని, అనేక

- మిగతా 2 లో

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింస
ఆక్షేపణీయం

సీపీఐ జాతీయ సమితి తీర్మానం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింసను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి తీవ్రంగా ఖండించింది. ఈ తరహా ఘటనలను తక్షణమే కట్టడి చేయకపోతే పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. బంగ్లాదేశ్ మైనారిటీలపై హింస సాకుతో భారత్‌లోని పాలకపక్షం మతచిచ్చుకు ప్రయత్నించవచ్చని, అలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలని ప్రగతిశీల, లౌకిక శక్తులకు సీపీఐ పిలుపునిచ్చింది. మత సామరస్యాన్ని పరిరక్షించడానికి కట్టుబడాలని, మత హింస విషయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు, సానుభూతిపరులకు సూచించింది.

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింసను ఖండిస్తూ సమితి సమావేశాల్లో తీర్మానం చేసింది. హిందువులు, ఇతర మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను సీపీఐ ఆక్షేపించింది. ఇలాంటి చర్యలతో లౌకిక సిద్ధాంతాలు, సమానత్వం, న్యాయానికి విఘాతం కలగడమే కాకుండా మత సామరస్యానికి భారీ ముప్పు కలిగిస్తాయని, బంగ్లాదేశ్ వైవిధ్య సమాజాన్ని ప్రమాదంలోకి నెడతాయని హెచ్చరించింది. వీటిని కట్టడి చేయకపోతే రెండు దేశాల మధ్య ప్రతికూల పరిస్థితులు, ఉద్రిక్తతలకు దారితీస్తాయని హితవు పలికింది. పొరుగు దేశాల ఐక్యత, ప్రగతికి మత సామరస్యం కీలకమన్నది సీపీఐ నమ్మకమని పేర్కొంది.

రేపే పింఛన్లు

ఒకటో తేదీ సెలవు... ముందుగానే పంపిణీ

వరుసగా మూడు నెలలు లేకుంటే నిలిపివేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ సామాజిక భరోసా డిసెంబరు పింఛన్ ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో పెన్షన్ డబ్బులను ఈనెల 30న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఇప్పటివరకు ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే ఆ తర్వాత నెలలో దానిని ఇచ్చేవారు కాదు. ఏ నెలకు ఆ నెల పెన్షన్ తీసుకునేందుకు లబ్ధిదారులు సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామానికి వచ్చి ఒకటో తేదీకి అందుబాటులో ఉండేవాళ్లు. ఇక నుంచి ఆ సమస్య లేకుండా ఆరోజు తీసుకోలేని వారికి డిసెంబరు రెండున లేదంటే వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన రెండు నెలల పింఛన్ పొందవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఒక నెల పెన్షన్ తీసుకోని వారికి ఆ తర్వాత నెలలో దానిని కలిపి రెండు నెలల నగదు ఒకేసారి ఇస్తారు. వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోని వారికి మూడో నెలలో మూడు నెలలకు కలిపి పెన్షన్ డబ్బులు అందజేస్తారు. డిసెంబరు నుంచే ఈ నిబంధన అమలు చేస్తున్నారు. వరుసగా మూడు నెలలు పెన్షన్లు తీసుకోపోతే మాత్రం శాశ్వత వలసగా పరిగణించి... ఆ లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్ తొలగిస్తుంది. ఆ తర్వాత వచ్చినా రోల్‌బాక్ ద్వారా మళ్లీ మంజూరు అవుతుంది. మూడు నెలల బకాయిలు

- మిగతా 2 లో

స్థిరంగా వాయుగుండం

- 24 గంటల్లో భారీ వర్షాలు
- తిరుపతి, నెల్లూరుకు రెడ్ అలర్ట్
- చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు
- ప్రభుత్వం అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. శ్రీలంకలోని ట్రింకోమలీకి 100 కిలోమీటర్లు, తమిళనాడులోని నాగపట్నానికి 320, పుదుచ్చేరికి 410, చెన్నైకి 490 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమై ఉంది. రానున్న 12 గంటల్లో శ్రీలంక తీరాన్ని దాటి తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ గురువారం తెలిపింది. ఆ తర్వాత ఉత్తర-వాయువ్య దిశగా పయనించనుందని, శనివారం ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల

- మిగతా 2 లో

వాయిదాల పర్వం

- పార్లమెంటును కుదిపేసిన అదానీ స్కామ్
- చర్చకు అనుమతించని సభాపతులు
- మిన్నంటిన ఇండియా ఎంపీల నిరసనలు
- ఉభయ సభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ: అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్, సంభాల్‌లో హింసపై ఇండియా ఐక్యసంఘటన ఎంపీలు పట్టుబట్టడం... ఇందుకు సభాపతులు సమ్మతించకపోవడంతో పార్లమెంటులో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రత్యేకించి అదానీ ముడుపుల వ్యవహారం పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కుదిపేస్తోంది. ప్రతిపక్షాల నిరసనలతో ఉభయసభలు మరోసారి వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయసభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవలే జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వయనాడ్ ఎంపీగా ప్రియాంక గాంధీ, నాందేడ్ ఎంపీగా రవీంద్ర వసంతరావు చవాన్ చేత స్పీకర్ ఓం బిర్లా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత సభా కార్యక్రమాలను మొదలు పెట్టారు. ఇండియా ఎంపీలు సభలో అదానీ అంశాన్ని లేవనెత్తారు. అదానీ సంస్థపై నమోదైన కేసు, ఈ సంస్థపై వచ్చిన ఆరోపణలపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సభలో నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. దీంతో స్పీకర్ సభను 12 గంటల వరకూ వాయిదా వేశారు. ఆతర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ నిరసనలు వెల్లువెత్తడంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. లోక్‌సభ వాయిదా వేయడానికి ముందు, వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ కమిటీకి వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకు పొడిగింపును మంజూరు చేస్తూ లోక్‌సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మొఘల్ కాలం నాటి మసీదులో కోర్టు ఆదేశించిన సర్వే సందర్భంగా సంభాల్‌లో హింసకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో గుమిగూడారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ... "సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికి కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను నేను ఖండిస్తున్నాను" అని అన్నారు. కాగా ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతుండగానే స్పీకర్ స్థానంలో ఉన్న తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఎంపీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

4న పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్ ప్రయోగం

విశాలాంధ్ర-నెల్లూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే నెల నాలుగో తేదీ సాయంత్రం గం.4.08 రాకెట్‌ను తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ సీ.59 రాకెట్ ప్రయోగించనుంది. శ్రీహరికోట షార్‌లోని ప్రయోగ వేదికకు సంబంధించిన మొబైల్ సర్వీస్ టవర్‌లో

- మిగతా 2 లో

ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి క్షిపణి పరీక్ష

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన వ్యూహాత్మక అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ ద్వారా కే4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష జరిగింది. విశాఖ తీరంలో భారత నౌకాదళం దీనిని నిర్వహించినట్లు రక్షణరంగ అధికారులు తెలిపారు. అరిఘాత్ నుంచి కే4 క్షిపణి పరీక్షించడం ఇదే తొలిసారి. 3,500 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా మంగళవారం నిర్వహించిన ఈ ప్రయోగం ఫలితాలను ఇప్పుడు విశ్లేషిస్తున్నారు. ఐఎన్ఎస్ అరిఘాత్‌ను రెండు నెలల క్రితమే రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ఐఎన్ఎస్ అరిహంత్ మాదిరిగానే అరిఘాత్ నిర్మాణాన్ని కూడా తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకల స్థావరం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులోని 'షిప్ బిల్డింగ్ సెంటర్'లో 2011 డిసెంబరులో చేపట్టారు. తొలిదశ నిర్మాణం తర్వాత 2017 నవంబరు 19న జలప్రవేశం చేయించారు. అనంతరం అంతర్గత విభాగాల పరికరాల బిగింపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాడార్ వ్యవస్థ, ఆయుధ సంపత్తి సమకూర్చడం వంటి కీలక పనులన్నింటినీ పూర్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా బాలిస్టిక్

క్షిపణులను ప్రయోగించగల అణు జలాంతర్గాములు కలిగిఉన్న దేశాల్లో భారత్ ఆరోస్థానంలో నిలిచింది. భారత్ కంటే ముందు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా ఉన్నాయి. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే కె-15, కె-4 క్షిపణులను కూడా భారత్ అభివృద్ధి చేసింది. చైనాను దృష్టిలోఉంచుకొని 3500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా వాటిని రూపొందించింది.

జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సోరెన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సంతోశ్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించారు. రాంచీలోని మొరహాబాదీ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,

- మిగతా 2 లో

725 మిలియన్ డాలర్ల విలువైన అస్త్రాలు సిద్ధం

ఉక్రెయిన్ కోసం అమెరికా నిర్ణయం

వాషింగ్టన్: రష్యాపై యుద్ధం చేసేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోంది. తాజాగా 725 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను ఉక్రెయిన్‌కు ఇవ్వాలని నిర్ణయించింది. ల్యాండ్ మైన్స్, డ్రోన్లు, స్టింగర్ క్షిపణులతో పాటు హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్స్ (హెచ్‌ఎమ్‌ఏఆర్‌ఎస్)ను అందించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. క్లస్టర్ ఆయుధాలు సైతం ఇస్తున్నట్లు పేర్కొన్నాయి. అధ్యక్షుడు బైడెన్ జనవరిలో పదవీ విరమణ చేయనుండగా, దీనికి ముందే ఉక్రెయిన్‌ను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తాజా సాయం చేస్తున్నట్లు వెల్లడించాయి. ప్రెసిడెన్షియల్ డ్రాడౌన్ అథారిటీ (పీడీఏ) అని పిలిచే అధికార ఆయుధ నిల్వల కేంద్రంలో ఆయుధాలను ఇటీవల కాలంలో బైడెన్ ఎక్కువగా వినియోగించినట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో అమెరికా మిత్ర దేశాలకు సాయం చేసేందుకు పీడీఏలోనే ఆయుధాలను నిల్వ చేస్తారు. అమెరికా దశాబ్దాలుగా ల్యాండ్‌మైన్స్ తయారీని ఆపేసింది. ప్రస్తుతం ఉక్రెయిన్‌కు అందిస్తున్న ల్యాండ్ మైన్స్ వాటంతటవే నిర్వీర్యం అయ్యేలా టైమ్ సెట్ చేసుకొనేలా తయారు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వీటిల్లో బ్యాటరీలు నాలుగు గంటల నుంచి రెండు వారాల వరకు మాత్రమే యాక్టివ్‌గా ఉంటాయన్నాయి.

అవినీతి అధికారులపై చైనా కొరడా

బీజింగ్: అవినీతి అధికారులపై చైనాలోని కమ్యూనిస్టుల ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. అక్రమాలకు, అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తే సంబంధిత అధికారులను ఉపేక్షించడం లేదు. వారిపై గట్టి చర్యలు తీసుకుంటోంది. పదవుల నుంచి తొలగిస్తోంది. తాజాగా సైనిక ఉన్నత అధికారిపై విచారణ చేపట్టింది. సైన్యాధికారి మియావో లీపై విచారణ జరుగుతున్నట్లు రక్షణశాఖ గురువారం తెలిపింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కార్యకలాపాలను పర్యవేక్షించే శక్తిమంతమైన సైనిక కమిషన్ 'పొలిటికల్ వర్క్ డిపార్ట్‌మెంట్'కు డైరెక్టర్‌గా ఉన్న లీపై అవినీతి ఆరోపణలు వచ్చినట్లు తెలిపింది. ఇదిలావుంటే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో అవినీతి ఆరోపణలపై గతేడాది నుంచి విస్తృత స్థాయి విచారణ సాగుతోంది. ఇటీవల రక్షణ మంత్రి డాంగ్ జున్ కూడా విచారణను ఎదుర్కొన్నారు. తొమ్మిది మంది జనరల్లతో పాటు రక్షణ రంగ ఎగ్జిక్యూటివ్‌లు పదవులు కోల్పోయారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక చర్యలు ముమ్మరం కావడం విదితమే.

అరెస్టు వారెంట్ రద్దు చేయాలి

ఐసీసీకి ఇజ్రాయిల్ ఫిర్యాదు

ది హేగ్: యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆ దేశ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్‌పై జారీచేసిన అరెస్టు వారెంటును రద్దు చేయాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)ను ఇజ్రాయిల్ కోరింది. అరెస్టు వారెంట్లను సవాల్ చేస్తూ పిటిషన్ వేసినట్లు నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటన చేసింది. 'అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్లను సవాలు చేశాం. ఈ అభ్యర్థనను కోర్టు తిరస్కరిస్తే ఐసీసీ మాకు వ్యతిరేకంగా, ఎంత పక్షపాతంతో ఉందో అమెరికాతో సహా మిత్ర దేశాలకు తెలుస్తోంది' అని పేర్కొంది. మానవతా సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తూ అమాయక పౌరుల రక్తాన్ని చిందిస్తూ, పసి పిల్లల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయిల్‌పై ఐసీసీ ఆగ్రహం వ్యక్తంచేసింది. యుద్ధ నేరాలు రుజువు చేసేందుకు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు ఉన్నట్లు తెలిపింది. ఇదే క్రమంలో ఆదేశ ప్రధాని, రక్షణ మంత్రిని అరెస్టు చేసేందుకు వారెంట్లు జారీచేసింది. వారెంట్ల జారీ అసంబద్ధం, తప్పుడు చర్యని నెతన్యాహు దుయ్యబట్టారు. తమపై జారీ చేసిన వారెంట్లను రద్దు చేయాలంటూ ఐసీసీని ఆశ్రయించారు.

4న పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

పీఎస్ఎల్వీ సీ59 రాకెట్ అనుసంధానం పనులు చురుకుగా జరుగుతున్నాయి. సీ59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోభా-3 అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు చిన్నతరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించనున్నారు. డిసెంబరు 24న పీఎస్ఎల్వీ సీ60 మరో రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా రిశాట్-1బీ అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు వాణిజ్యపరమైన ఉపగ్రహాలను ప్రయోగించబోతున్నారు.

మోదీకి బెదిరింపు ఫోన్ కాల్

(మొదటిపేజీ తరువాయి)

ఓ ఆయుధాన్ని సైతం సిద్ధం చేసుకున్న ట్లు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు... నిందితురాలి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌ను ట్రేస్ చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

వాయిదాల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణ ప్రసాద్ తెన్నేటి సభా కార్యక్రమాలను రేపటికి వాయిదా వేశారు.

రాజ్యసభ వాయిదా

మరోవైపు ఎగువ సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అదానీ వ్యవహారంపై చర్చకు కాంగ్రెస్ సహా ఇండియా ఐక్యసంఘటన ఎంపీలు పట్టుపడటంతో సభను 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు శాంతించలేదు. పెద్దపెట్టున వారు చేసిన నినాదాలతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తరహా పార్లమెంటరీ విధానం ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. 'అర్థవంతమైన సంభాషణ యొక్క స్ఫూర్తిని స్వీకరించాలని నేను మీ అందరినీ కోరుతున్నాను. మన ఆలోచనాత్మక చర్చ మరియు చర్చల సంప్రదాయానికి తిరిగి వెళ్దాం. ఈ స్ఫూర్తితో, నేటి ఎజెండాను కొనసాగించడంలో మీ సహకారాన్ని నేను అభ్యర్థిస్తున్నాను' అని ధన్కర్ నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష సభ్యులను ఉద్దేశించి అన్నారు. రాజ్యాంగాన్ని మనకు అందించిన వారి స్ఫూర్తిని మనం అగౌరవపరచకూడదని తెలిపారు. అయితే నిరసనలు కొనసాగడంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. ఎగువ సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశం కానుంది. సభ ప్రారంభమవగానే అమెరికాలో అదానీ గ్రూప్‌పై ఆరోపణలు ,మణిపూర్, సంభాల్‌లో హింసపై చర్చ కోరుతూ ఇచ్చిన వాయిదా నోటీసులను తిరస్కరించడంపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేయడంతో దాదాపు 50 నిమిషాల పాటు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. దీనికి సంబంధించి మొత్తం 16 నోటీసులు తిరస్కరిస్తున్నట్లు ధన్కర్ తెలిపారు.

జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా ఐక్యసంఘటన నేతలు హాజరయ్యారు. ఇప్పటివరకు మూడుసార్లు సీఎంగా పని చేసిన హేమంత్... తాజాగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఈడీ అధికారులు హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సీఎం పదవికి రాజీనామా చేసిన ఆయన... ఐదు నెలల అనంతరం జైలు నుంచి విడుదలయ్యారు. మళ్లీ సీఎం పగ్గాలు చేపట్టిన హేమంత్... ప్రజల్లో నమ్మకాన్ని కూడగట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. తన సతీమణితో కలిసి విస్తృతంగా ప్రచారం చేపట్టి పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం భారీ విజయం సాధించింది. రాష్ట్రంలో 81 స్థానాలుండగా... జేఎంఎం 34 చోట్ల విజయం సాధించింది. బీజేపీ 21, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్)(ఎల్) రెండు, ఏజేఎస్‌యూపీ, లోక్ జనశక్తిపార్టీ (రాం విలాస్), జేఎల్‌కేఎం, జేడీయూ చెరో ఒక స్థానం చొప్పున గెలుచుకున్నాయి. దాంతో జేఎంఎం నేతృత్వంలోని కూటమి తాజాగా రాష్ట్రంలో కొలువుదీరింది.

మా గొంతు నొక్కలేరు: హేమంత్

జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు బీజేపీపై విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ ప్రజలను ఎవరూ విడగొట్టలేరని వ్యాఖ్యానించారు. 'ఐకమత్యమే మనందరి ఆయుధం. అందులో ఏ సందేహం లేదు. మనల్ని ఎవరూ విభజించలేరు. తప్పుదోవ పట్టించలేరు. మన గొంతు నొక్కాలని వారెంతో (బీజేపీని ఉద్దేశిస్తూ) ప్రయత్నించారు. కానీ, వారి ప్రయత్నానికి రెట్టింపుగా మన తిరుగుబాటు, స్వరం మరింత బలపడింది. మనమంతా జార్ఖండ్ బిడ్డలం. ఎవరికీ తలవంచం' అని హేమంత్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

రాజ్యాంగ ప్రతితో ప్రియాంక ప్రతిజ్ఞ

లోక్‌సభ ఎంపీగా ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా (52) ప్రజా ప్రతినిధిగా తన రాజకీయ ప్రస్తానాన్ని మొదలు పెట్టారు. ఆమె పార్లమెంటు సభ్యురాలిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కేరళలోని వయనాడ్‌కు ఎంపీగా లోక్‌సభలో ప్రవేశించారు. రాజ్యాంగం ప్రతిని చేతబట్టి ప్రియాంక అను నేను... అంటూ ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలైన తల్లి సోనియాగాంధీ, సోదరుడు రాహుల్ గాంధీతో పాటు పార్లమెంటుకు వచ్చిన ఆమె హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు పార్లమెంటు సభ్యులుగా ఉండటం అరుదు కాగా ప్రియాంక ప్రమాణ స్వీకారానికి ప్రాధాన్యత వచ్చింది. కేరళకు చెందిన కసావు చీరకట్టులో ఆమె పార్లమెంటుకు వచ్చారు. ప్రమాణ స్వీకారం కోసం ప్రియాంక తన స్థానం నుంచి పైకి లేచి వెళ్లే సమయంలో కాంగ్రెస్ సభ్యులంతా 'జోడో జోడో భారత్ జోడో' అంటూ నినాదాలిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా, కుమారుడు రైహాన్, కుమార్తె మిరాయా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందుకు పార్లమెంటు ఆవరణలోని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీలంతా కలుసుకున్నారు. ప్రియాంకకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ తరపున నాందేడ్ నుంచి గెలుపొందిన రవీంద్ర చవాన్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మరాఠీలో ప్రతిజ్ఞ చేశారు. రవీంద్ర చవాన్ తండ్రి వసంతరావ్ చవాన్ మరణంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ప్రమాణ స్వీకారాల అనంతరం విపక్ష సభ్యులంతా వెల్‌లోకి ప్రవేశించి అదానీ అవినీతి, సంభాల్ హింసపై చర్చకు డిమాండ్ చేయడంతో లోక్‌సభ వాయిదా పడింది. ఎంపీలంతా సభ నుంచి బయటకు వచ్చే సమయంలో నేతలంతా క్యూకట్టి ప్రియాంక గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. సంవిధాన్ సదన్ ముందర ప్రియాంకతో కలిసి రాహుల్ గాంధీ ఫొటో దిగే క్రమంలో కాంగ్రెస్ ఎంపీలంతా చుట్టూ చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఖడ్గేను కలిసి ఆయన ఆశీర్వాదాన్ని ప్రియాంక పొందారు.

కాంగ్రెస్‌లో నయా జోష్

ప్రియాంక పార్లమెంటు ప్రవేశంలో కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం కనిపించింది. ప్రియాంక పార్లమెంటులో అడుగు పెట్టే క్షణం కోసం పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు చాలా కాలం నిరీక్షించారు. ఇప్పుడు అది జరిగింది. దీంతో పార్టీ పుంజుకోగలదన్న ఆశ కాంగ్రెస్ శ్రేణుల్లో కలిగింది. 2019లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంక ఆ తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఐదేళ్ల తర్వాత ప్రజా ప్రతినిధిగా పార్లమెంటులోకి అడుగు పెట్టారు. తన రాజకీయ ప్రస్తానాన్ని కొత్తగా మొదలు పెట్టారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమితో కాంగ్రెస్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రియాంక పార్లమెంటుకు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని ప్రియాంక తేగలరా అన్న ఆసక్తికర చర్చకు తెరతీసింది. ఇదిలావుంటే, ప్రియాంక 1972, జనవరి 12న జన్మించారు. న్యూఢిల్లీ మోడరన్ స్కూల్, కాన్వెంట్ ఆఫ్ జీసెస్ అండ్ మేరీలో చదువుకున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ- జీసెస్ అండ్ మేరీ కాలేజి నుంచి సైకలాజీలో డిగ్రీ పట్టా పొందారు. బుద్ధిస్ట్ స్టడీస్‌లో ఆమె మాస్టర్స్ చేశారు. తాజా ఉప ఎన్నికల్లో వయనాడ్ నుంచి 4.1లక్షల ఓట్లతో ప్రియాంక ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

మెస్ చార్జీలు పెంచండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డొక్కా సీతమ్మ పథకం కింద ప్రతి విద్యార్థికి మెస్ చార్జీలు కేంద్రం ప్రకటించిన రూ.6.19 నుంచి రూ.30కి పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కూన స్రవంతి, ఎం.రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం యూనియన్ నేతలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పీఎం పోషణ్ పథకం కింద వంట ధరలను కేంద్రం పెంచిందని, కేంద్ర విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీజేసిందని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలల (1-5 తరగతులు) విద్యార్థులకు భోజనం పెట్టేందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి రూ.5.45 చొప్పున చెల్లిస్తుండగా... దాన్ని రూ.6.19కి పెంచుతూ ఇటీవల ఉత్తర్వులిచ్చారని గుర్తుచేశారు. ప్రాథమికోన్నత పాఠశాల(6-8 తరగతుల) పిల్లలకు రూ.8.17 చెల్లిస్తుండగా, దానిని రూ.9.29కు పెంచారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ చార్జీలు ఏ మూలకు సరిపోవని, తక్షణమే ప్రతి విద్యార్థికి రూ.30 చొప్పున ఇవ్వాలన్నారు. వంట ఏజెన్సీ కార్మికులకు రూ.మూడు వేల నుంచి రూ.10వేల వేతనం పెంచాలన్నారు. కొత్త ధరలు డిసెంబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర విద్యాశాఖ పేర్కొందని, ఒక్కో విద్యార్థికయ్యే ఖర్చుతో పోల్చుకుంటే కనీసం కూరగాయలు కొనడానికి కూడా ఆ డబ్బులు చాలవని, భోజనం వండేందుకు బియ్యం అందిస్తే సరిపోదని వివరించారు. కూరల కొనుగోలు, పప్పు, నూనెలు తదితరలకు మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

రేవంత్ కుటుంబ సర్వే పూర్తి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు గురువారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో పాల్గొన్నారు. సంబంధిత వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎంఏ& యూడీ సహాయ కార్యదర్శి ప్రియాంక, జూబ్లీ హిల్స్ సర్కిల్ సహాయ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు. కుటుంబ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు కూడా 'ఎస్ఈఈఈపీసీ' సర్వేలో పాల్గొనాలన్నారు. సర్వేకు వెళ్లినప్పుడు తాళం వేసివున్న ఇళ్లను గమనంలో ఉంచుకొని, తర్వాత వెళ్లి సర్వే చేయాలని ఎనుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సీఎం ఆదేశాలిచ్చారు.

వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు వివరాలు నమోదు చేసుకోని కుటుంబాలు జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040-2111111కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

స్థిరంగా వాయుగుండం



(మొదటిపేజీ తరువాయి)

వెంట కారైకాల్-మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో శుక్ర, శనివారాలు భారీ వర్షాలకు అవకాశం ఉండగా, మిగలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దక్షిణకోస్తా తీరం వెంట గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు... అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఇప్పటికే తిరుపతి, నెల్లూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా... చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ జేశారు. రానున్న 24 గంటలలో తిరుపతి, నెల్లూరు జిల్లాలో అతి భారీ వర్షాలు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్

ప్రకాశం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. మూడు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాన్ తీరం దాటే సమయంలో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటలకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. పోర్టులలో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించింది. పంట చేతికొచ్చే సమయంలో తుపాను రావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ఆగమేఘాల మీద వరి కోతలు చేపట్టి.. వాటిని రహదారులపై ఆరబెడుతున్నారు. వాయుగుండం ప్రభావిత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు.

రేపే పింఛన్లు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం ఇవ్వరు. డిసెంబరు పెన్షన్ ఒక్క రోజు ముందుగానే ఇవ్వడంతో పెన్షన్ దారులు ఊరట చెందుతున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. త్వరలోనే కొత్త పింఛన్లు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. శాసనసభ సమావేశాల్లో కొత్త పెన్షన్లపై సభ్యులు ప్రస్తావించడంతో త్వరలో జారీ చేయనున్నట్లు సెర్ప్ మంత్రి వివరణ ఇచ్చారు. అనర్హుల ఏరివేత ప్రక్రియ కూడా చేపడుతున్నారు.

అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కొత్త పెన్షన్ల జారీకి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. డిసెంబరు మొదటి వారం నుంచి అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించేందుకు సిద్ధమైంది. ఇటీవల అర్హులైన వ్యక్తులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. తన కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. సామాజిక పెన్షన్ దారులు పెన్షన్ పంపిణీ సమయంలో గ్రామంలో ఒకటి, రెండు నెలలు లేకపోయినా... తర్వాత నెలలో పెన్షన్ మొత్తాన్ని కలిపి ఇవ్వాలని, వరుసగా మూడు నెలల పాటు గ్రామంలో అందుబాటు లేకపోతే వారిని శాశ్వత వలసదారులుగా గుర్తించి పెన్షన్ తాత్కాలికంగా ఆపేస్తారు. తర్వాత కాలంలో వారు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే వారికి తిరిగి పెన్షన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తొలగించినవారి సంగతేమిటి?

గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ఉన్న కుటుంబాలకు పెన్షన్లను రద్దు చేశారు. రూ.25వేల లోపు వేతనాలున్న ఉద్యోగుల ఇళ్లలో పెన్షన్లను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్నారనే సాకుతో లక్షలాది మందికి వైసీపీ ప్రభుత్వం పెన్షన్లు తొలగించింది. రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులందరిని ఒకే యూనిట్‌గా పరిగణించడంతో ఈ సమస్య ఏర్పడింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఇంట్లో వృద్ధులు గ్రామాల్లోనే నివాసం ఉన్నా పెన్షన్లు రద్దు చేశారు. పట్టణాల్లో నామ మాత్రపు జీతాలతో పని చేస్తూ తమ వల్ల కుటుంబాలకు పెన్షన్ భరోసా కోల్పోయిన వాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పెన్షన్ల అర్హతపై కొత్త ప్రభుత్వం జరిపిన పరిశీలనలో మూడు లక్షల వరకు అనర్హత పొందాయని, మరో 2.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మందికి దివ్యాంగుల పింఛన్లు ఉండగా, వాటన్నింటిని పరిశీలించనున్నారు. తక్షణమే అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు జారీజేసి, వారికి సామాజిక భరోసా పెన్షన్లు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆ కేసులో నా పేరు లేదు

వారిపై పరువు నష్టం దావా వేస్తా

అది సెకీ, రాష్ట్ర ప్రభుత్వ, డిస్కంల ఒప్పందం

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ ఆదానీపై అమెరికాలో నమోదైన కేసులో తన పేరు లేదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అది దుష్ప్రచారమేనన్నారు. ముఖ్యమంత్రులను పారిశ్రామిక వేత్తలు కలుస్తారని, తానుకూడా అలాగే ఆదానీని కలిశానని గుర్తుచేశారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 2021, సెప్టెంబరు 15న రాష్ట్ర ప్రభుత్వానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి వచ్చిన లేఖను గురించి వివరించారు. కేంద్ర సంస్థ సెకీతో ప్రభుత్వం నేరుగా జరిపిన లావాదేవీ ఇదని, ఇక్కడ మూడో వ్యక్తి ఎవరూ లేరని స్పష్టంచేశారు. యూనిట్ రూ.2.49కేనని, ఇది రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ ఖర్చుతో వచ్చే విద్యుత్ అని వివరించారు. ఈ ప్రాజెక్టుకు మాత్రమే ఐఎస్‌టీఎస్ (ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జెస్) ఉండబోదని, ఇది స్పెషల్ ఇన్సెంటివ్‌గా ఇస్తున్నామన్నారు. సెకీ నుంచి 2021, సెప్టెంబరు 15న లేఖ రాగా... మంచి ఆఫర్ కావడంతో ఆ మర్నాడే కేబినెట్ మీటింగ్ ఉండటంతో దాన్ని టేబుల్ ఐటెం కింద పెట్టామన్నారు. దీనిపై సెప్టెంబరు 16న కేబినెట్‌లో చర్చించామని, అధ్యయనం చేసి వచ్చే కేబినెట్ నాటికి నివేదిక ఇవ్వాలని ఇంధన శాఖ ఆదేశించడం జరిగిందన్నారు. దాదాపు 40 రోజుల పాటు అన్నీ అధ్యయనం చేసిన ఇంధన శాఖ కమిటీ, 2021, అక్టోబరు 25న నివేదిక సమర్పించిందని జగన్ వెల్లడించారు. ఆ తర్వాత అక్టోబరు 28న కేబినెట్... ఏపీఈఆర్‌సీ అనుమతి కూడా తీసుకోవాలని నిర్దేశించి, ఆమోదం తెలిపిందన్నారు. ఆ తర్వాత నవంబరు 11న ఏపీఈఆర్‌సీ క్లియరెన్స్ ఇచ్చిందని, ఆ క్రమంలో డిసెంబరు 1, 2021న ప్రభుత్వం, సెకీ మధ్య పవర్‌సేల్ అగ్రిమెంట్(పీఎస్ఏ) జరిగిందని జగన్ తెలిపారు. దాంట్లో ఎవరెవరు సైన్ చేశారంటే..సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, నాలుగు డిస్కమ్‌లు సంతకాలు చేశారని, ఇక్కడ ఎక్కడా థర్డ్ పార్టీ లేదన్నారు. స్పష్టంగా చెప్పాలంటే...అది సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య జరిగిన ఒప్పందం అని, దానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి ముందే ఇచ్చిందని వివరించారు. మీడియా ప్రశ్నలకు జగన్ సమాధానమిస్తూ, అమెరికాలో నమోదైన డాక్యుమెంట్‌లో ఎక్కడా నా పేరు లేదని స్పష్టం చేశారు.

సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌ల మధ్య ఒప్పందంలో మధ్యలో దళారి లేదని, అలాంటప్పుడు అవినీతికి అవకాశం ఎక్కడ? అని ప్రశ్నించారు. విద్యుత్ ఒప్పందాలకు ముడిపెట్టి నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, 48గంటల సమయం ఇస్తున్నానని, ఆ లోపు క్షమాపణలు చెప్పకపోతే రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. రాష్ట్రం తిరోమనంలో పయనిస్తోందని సూపర్ సిక్స్‌లు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కనిపించడంలేదన్నారు. బడ్జెట్‌తో ప్రజలకు భరోసా ఇవ్వలేకపోయారని, రాష్ట్రంలో స్కామ్‌ల పాలన నడుస్తోందని జగన్ దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎంతో శ్రమించానని, తన కష్టాన్ని వృథా చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు.

పూలేకు జగన్ నివాళి

మహాత్మా జ్యోతిరావు పూలేకు మాజీ సీఎం జగన్ నివాళులర్పించారు. తాడేపల్లిలోని తన నివాసంలో గురువారం పూలే చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఆర్.రమేశ్ యాదవ్, మాజీ మంత్రులు జోగి రమేశ్, విడదల రజని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అంకంరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

బీసీలను బ్యాక్‌బోన్ క్లాస్‌లుగా గుర్తించిన జగన్: వైసీపీ

బీసీలను బ్యాక్‌బోన్ క్లాస్‌లుగా జగన్ గుర్తించారని వైసీపీ నేతలు కొనియాడారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, రమేష్‌యాదవ్, జోగి రమేశ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమేష్‌యాదవ్ మాట్లాడుతూ పూలే ఆశయాలను ఆచరణలో పెడుతూ, బీసీలను బ్యాక్‌బోన్ క్లాస్‌లుగా గుర్తించిన ఘనత జగన్‌కే దక్కుతుందని చెప్పారు. రమేశ్ మాట్లాడుతూ, అభినవ పూలే జగన్ అని కొనియాడారు. లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన అవసరం

(మొదటిపేజీ తరువాయి)

విశ్వవిద్యాలయాలకు వీసీల నియామకం జరగలేదని చెప్పారు. జగన్ హయాంలో రూ.2.53 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే రాష్ట్రం దివాలా తీసిందని గోల చేసిన చంద్రబాబు...తాను మాత్రం రూ.2.94 లక్షల కోట్లు బడ్జెట్ ఏ విధంగా ప్రవేశపెట్టారని రామకృష్ణ ప్రశ్నించారు. అదానీ అవినీతి, లంచాల బాగోతం బయటపడినా కూటమి ప్రభుత్వం మాత్రం అదానీతో ఒప్పందాలను రద్దు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న ఉద్యోగుల తలరాతను రాజకీయ నేతలు రాస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి సమర్థవంతమైన రాజకీయనేతగా ఎదగాలని, మంచి సమాజాన్ని నిర్మించేందుకు తమవంతు బాధ్యత వహించాలని రామకృష్ణ కోరారు.

అమరావతిలో ఈగల్ కేంద్ర కార్యాలయం

(మొదటిపేజీ తరువాయి)

ఈగల్ పనిచేస్తుంది. ఈగల్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంతో పాటు జిల్లా స్థాయి నార్కోటిక్ సెల్స్‌లో 341 మంది సిబ్బంది ఉంటారు. వారికి 30 శాతం ప్రత్యేక అలవెన్స్ ఇవ్వనున్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు సంబంధించిన వ్యవహారాల విచారణకు ఐదు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు హైకోర్టుకు ప్రభుత్వం నివేదించింది.

త్వరలో రైతు భరోసా : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండబ్యూరో : త్వరలో రైతులందరికీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాలో జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా త్వరలో రైతు సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ 7న బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, నల్గొండలోని మెడికల్ కళాశాలకు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎన్జీ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు రిజర్వాయర్ ను ఇప్పటికే నింపడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో చుట్టుపక్కల గ్రామాలలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగు ఆయకట్టు పెరుగుతుందన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో 18 సంవత్సరాల తన చిరకాల వాంఛ నెరబొరబోతుందని అన్నారు. రైతు రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో రైతులకు చెల్లిస్తామని స్పష్టం చేశారు. నల్గొండ పట్టణంలో రూ.110 కోట్లతో స్పెషల్ డెవలప్మెంట్ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తోపాటు పలు అభివృద్ధి పనులు, రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన, రూ.275 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా పాత టౌన్ హాల్లో కొత్తగా జిల్లా గ్రంథాలయంకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు. శుక్రవారం సీఎం పర్యటనకు సంబంధించి ఖచ్చితమైన తేదీని ప్రకటించి చెబుతానని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు అన్నిటిని కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మూసితో ఎక్కువ నష్టపోయేది, అనారోగ్యం పాలయ్యేది నల్లగొండ జిల్లా ప్రజలేనన్నారు. మూసి ప్రక్షాళనతో న్యాయం జరుగుతుందన్నారు.ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గానికి సంబంధించి రెండు మిషన్లు త్వరలో జిల్లాకు చేరుకుంటాయని, 20 నెలల్లోనే సొరంగ మార్గాన్ని పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 11 నెలలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని అన్నారు.కెసిఆర్ తెలంగాణను అప్పులపాలు చేయగా వాటిని భరిస్తూ పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుంటే మోడీ విమర్శించడం శోచనీయమన్నారు. హైదరాబాద్-విజయవాడ రోడ్డును కేంద్రమంత్రి గట్కరితో చర్చించి ఫైనల్ చేయడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ప్రతిపక్ష నాయకుడు ఎవరో చెప్తే వారు మాట్లాడితే తాను సమాధానం చెప్తానని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కెసిఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని ఏడు లక్షల కోట్లు అప్పు చేసి ఫామ్ హౌస్‌లో పండుకున్నాడని విమర్శించారు. అల్లుడు హరీష్‌రావు, కొడుకు కేటీఆర్ గురుకులాల గురించి మాట్లాడితే తాను సమాధానం చెప్పనని, వాళ్ళు నా స్థాయి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్ వచ్చి మాట్లాడాలన్నారు. నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బుగోని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల ప్రతీకల ఆవిష్కరణ

ఇల్లందు - విశాలాంధ్ర: సింగరేణి పుట్టినిలైన ఇల్లందులో సంస్థ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేల ప్రతీకలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఎమ్మెల్యే కోరం కరకయ్యతోపాటు జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ పాల్గొని ప్రతీకను ఆవిష్కరించారు. గురువారం కార్మికుల ప్రతీకలను స్థానిక విద్యుత్ ఆఫీస్ చౌరస్తాలో ఏర్పాటు చేసారు. సంస్థలోని కార్మికుల పని విధివిధానాలను కనభరిచేలా విగ్రహాలను రూపొందించారు. ఇల్లందు ఏరియా ఖ్యాతిని అందరికీ తెలియజేసేలా విగ్రహాలను ఆవిష్కరించినందుకు జియం జాన్ ఆనంద్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జిఎం బొల్లం వెంకటేశ్వర్లు, డిజియం పర్సనల్ జివి.మోహన్‌రావు, డీజీఎం రవికుమార్, వివిధ గుర్తింపు సంఘం సభ్యులు అధికారులు, ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సుజాతనగర్ వేపలగడ్డలోని వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రాంగణం, వంట గదులు, భోజనాలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూసారు. ఇక్కడ ఇతర ఇబ్బందులను ఈ గురుకులం ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తాత్కాలిక భవనంలో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేశామని పక్కా గృహం చేపట్టాలని కలెక్టర్‌కు తెలిపారు. వారం రోజుల్లో గురుకుల విద్యాలయానికి బిల్డింగ్ తోపాటు కావలసిన ఇతర సదుపాయాల ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం సుజాతనగర్ లోని జిన్నింగ్ మిల్ ను పరిశీలించారు. డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు, గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ బ్యూలారాణి, ఏవో నర్మద, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదం

విశాలాంధ్ర - వనపర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో చెకుముకి సంబరాలు 2024 కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చెకుముకి సంబరాలు 2024 క్వశ్చన్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలి

విశాలాంధ్ర - కొమురం భీం : జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జెడ్పి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని తయారు చేస్తున్నారని వంట వారిని అడిగి తెలుసుకున్నారు. నిత్యం మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని ఆదేశించారు. మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం వడ్డించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులకు, వంటవారికి తగు సూచనలు చేశారు.

పదమూడు అంశాలపై కుదిరిన ఒప్పందాలు



విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థలు డిస్మిస్ అయిన జయం ఈటీలను తిరిగి నియమించుకునేందుకు ఒప్పందం కుదిరింది. సుదీర్ఘకాలం తర్వాత గురువారం గుర్తింపు సంఘం ఏఐటీయుసితో యాజమాన్యానికి 50వ స్ట్రక్చరల్ సమావేశం స్థానిక ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో జరిగింది. సుమారు 13 అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనేక సమస్యల విషయంలో యాజమాన్యం అంగీకారం కుదుర్చుకుంది. మైనింగ్ స్టాఫ్ సూపర్వైజర్స్ ట్రేడ్స్ మెన్ ఈపి ఆపరేటర్లకు మెడికల్ అండ్ ఫిట్ అయితే వారికి షూటబుల్ ఎంప్లాయిమెంట్ మీద చర్చించడం జరిగింది. మైనింగ్ టెక్నికల్ సూపర్వైజర్లకు మెడికల్ అన్ఫిట్ అయితే సూటబుల్ ఎంప్లాయ్మెంట్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ట్రేడ్స్ మేన్‌లకు, ఈపీ ఆపరేటర్లకు చైర్మన్‌తో జరిగే వచ్చే సమావేశంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ వారితో నడిపిస్తున్న క్యాంటీన్లను కంపెనీ నడపడానికి అంగీకరించారు. మెరిట్ స్కాలర్షిప్‌ను గతంలో 2000 ర్యాంక్ ఉంటే ఇప్పుడు దీన్ని 8 వేల ర్యాంకు వరకు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు వి. సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్, మిరియాల రంగయ్య, కె. సారయ్య, కె వీరబద్రయ్య, వై వి రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వంగ వెంకట్, రామ్ గోపాల్ పాల్గొన్నారు.

సీపీఐ నేత ప్రసాద్ జీవితం క్యాడర్‌కు ఆదర్శం

విశాలాంధ్ర - కొత్తగూడెం : సిపిఐ పార్టీ సీనియర్ నేత ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ జీవితం యావత్తు త్యాగాలతో కూడుకుందని ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు, కొత్తగూడెం ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సిపిఐ పార్టీ కోసం అంకితభావంతో సైనికుడిలా పని చేసిన ప్రసాద్ జీవితం ఆ పార్టీ క్యాడర్ కే కాక ప్రతి నాయకుడికి ఆదర్శప్రాయమన్నారు. తాను, తన కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారైనప్పటికీ చాలా ఏళ్లుగా ప్రసాద్‌తో సన్నిహిత, ఆత్మీయ సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. అందుకే బుధవారం ప్రసాద్ అకాల మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఈ పరిణామం తాను తట్టుకోలేక పోతున్ననన్నారు. ప్రసాద్ కుటుంబం యావత్తు దశాబ్దాల నుంచి సిపిఐ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా ఉద్యమంలో ఎన్నో త్యాగాలు సమర్పించారని ఈ సందర్భంగా నయీమ్ ఖురేషి ఒక్కొక్కటిగా గుర్తు చేశారు. ప్రసాద్ మరణానికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు.

విత్తన, ఫెర్టిలైజర్ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కూసుమంచి : విత్తన, పురుగుమందుల చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత హెచ్చరించారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని రైతువేదిక నందు పురుగుమందుల, ఎరువుల విత్తన వ్యాపారులతో కూసుమంచి మండలంలోని రైతువేదిక నందు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డీలర్లు అందరూ విత్తన చట్టం పురుగు మందుల చట్టం ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ వంటి చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. ప్రతి ఒక్క షాపులో తప్పనిసరిగా లైసెన్సులను డిస్ప్లే చేయాలని, స్టాకు బోర్డు ధరల పట్టికను ప్రదర్శించాలని, స్టాక్ రిజిస్టర్లను విధిగా రోజువారీగా అప్డేట్ చేయాలని, లైసెన్స్ నందు పిసిలు, ఓ ఫామ్‌లు జతపరచుకోవాలని, పిఓ ఎస్ మెషిన్‌లో ఉన్నటువంటి బ్యాలెన్స్ గ్రౌండ్ బ్యాలెన్స్ సరితూగాలని సూచించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మినట్లు సమాచారం వస్తే వారిపై సంబంధిత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, టెక్నికల్ ఏవో అరుణ మండలంలోని పురుగుమందుల, ఎరువుల విత్తన డీలర్లు పాల్గొన్నారు. కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత సమీక్ష సమావేశం నిర్వహించారు ఆమె మాట్లాడుతూ డీలర్లు అందరూ విత్తన చట్టం పురుగు మందుల చట్టం ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ వంటి చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, టెక్నికల్ ఏవో అరుణ మండలంలోని పురుగుమందుల, ఎరువుల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పాలన

విశాలాంధ్ర - గార్ల : విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు భోధించి స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి తోటి విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలను బోధించారు. విధులను తమ ఉపాధ్యాయులను అనుకరిస్తూ ఆకట్టుకునేలా నిర్వర్తించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తమ అనుభూతులను పరస్పరం పంచుకున్నారు. దీంతో ఈ పాఠశాలలో విద్యార్థుల పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సదర్ ఆధ్వర్యంలో ఉత్తమ భోదన అందించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కుటుంబరావు, వి. మంజుల, డి. నరేష్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఆహారోత్సవ దినోత్సవం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం జడ్పి హెచ్ఎస్ పాఠశాలల్లో గురువారం ఆహారోత్స దినోత్సవం కార్యక్రమం ఫుడ్ ఫేస్టివల్ వృత్తి విద్యా ఉపాధ్యాయులు శశిధర్ ఆధ్వర్యంలో, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రుచి కరమైన వంటలు చేశారు. ఈ వంటలను పాఠశాల ఉపాధ్యాయులు సందర్శించి, వంటలను, పరిశీలించి, వంట రుచులు చూసి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిఈటి రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సభ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే సభ ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డిసెంబర్ 4న ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభ నేపథ్యంలో స్థలాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, హైదరాబాద్ నుంచి బృందం వచ్చి స్టేజి నిర్మాణ పనులు ప్రారంభిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సభలో రుణమాఫీ జరిగిన రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, భావ్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా

విశాలాంధ్ర - చర్ల : మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల వేతనాలు పెంచాలని, చర్ల ఎంఈఓ కార్యాలయం ముందు సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ మండల అధ్యక్షురాలు పొడుపుగంటి సమ్మక్క మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేసారు. పాఠశాలలో వంట సెట్లు నిర్మించాలని, వంట పాత్రలు, వంట గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సప్లై చేయాలని డిమాండ్ చేశారు. రెండు జతల కాటన్ యూనిఫామ్ దుస్తులు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మిస్ ఛార్జీలు పెంచి, పెండింగ్లో ఉన్న బిల్లు మొత్తం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలు చెల్లించి ఎక్కువ గంటలు పని చేయించుకుంటున్నారని విమర్శించారు. కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. అనంతరం ఎంఈఓ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ నాయకులు లీలావతి, పద్మ, లక్ష్మి, రాణి, వెంకటమ్మ, మిడియం రాజేశ్వరి, విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలోని రేలకాయలపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నంత పాఠశాలలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గొప్ప ఆదర్శవంతుడని గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆనాటి కాలంలో దేశాన్ని పట్టి పీడిస్తున్న అంటరానితనాన్ని రూపు మాపిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. అంటరానితనం వెట్టి చాకిరీ విధానం వితంతు వివాహము మహిళలపై వివక్షత పురుషుల ఆధిక్యతపై అనేక ఉద్యమాలు చేసి అనేక సంఘ సంస్కరణలు తీసుకొచ్చిన మహానుభావుడు అలాంటి మహానుబావుణ్ణి అందరం గుర్తుచేసుకొని నివాళులు అర్పించడం మన కర్తవ్యం అన్నారు. ఈ సందర్భంలో భద్రాచలం ఐటీడీఏ పిఓ ఆధ్వర్యంలో పంపించిన వంటి ఉద్దీవకము పుస్తకాలను పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఎం.నాగేశ్వరరావు ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, డి.బిక్ష, జి.సత్రం, బి.వెంకటేష్, ఎం రాంబాబు, డి.తార, సిహెచ్ వెంకటేశ్వర్లు, జీ వెంకన్న, ఎం శివ ఏఎన్ఎం శ్రావణి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై షెడ్యూల్ ప్రకటించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : రైతులకు రెండు పంటలకు భరోసా, రుణమాఫీ సంపూర్ణంగా అందించకుండా రైతు పండుగా పేరుతో సంబరాలు అక్షేపణ్యం అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్ లో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా విధివిధానాలు రూపొందించటం పేరుతో కాలయాపన చేస్తూ రెండు సీజన్‌ల పంట పెట్టుబడి అందించలేదని, రైతు రుణమాఫీ 18 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఇంకా మిగిలి ఉందన్నారు. ధరణి భూ సమస్యలు పరిష్కారం కోసం భూ మాత కూడా అమల్లోకి రాలేదని రైతుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి వర్గం రైతులు సమస్యలు పరిష్కారం కోసం రైతు పండుగా, సంబరాల్లో నిర్దిష్ట కాలపరిమితితో షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, ఎస్ కె మీరా, సహాయ కార్యదర్శులు దుగ్గి కృష్ణ, గోదవర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పరేడ్ నిర్వహించిరు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను, ఫైల్‌లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటినారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అందరు కూడా ఆరోగ్యంగా ఉండి ఫిట్నెస్ కాపాడుకోవాలని, చెడు అలవాట్లకు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ విధుల పట్ల సక్రమంగా అప్రమత్తంగా ఉండి ప్రజలకు జవాబుదారీ తనంగా తమ విధులను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐ, సైదారావు, ఎస్ఐ గైక్వాడ్ రాహుల్ పోలీస్ సిబ్బంది అందరు పాల్గొన్నారు.

గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన

హైదరాబాద్: గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ (జీఎన్ఐ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోలారిస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఈఎస్పీఎల్) తో కలిసి ఇబ్రహీంపట్నం, జీఎన్ఐ క్యాంపస్‌లో 400 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇది జీఎన్ఐ మాజీ చైర్మన్, దివంగత సర్దార్ తవ్లీన్ కోహ్లీ 74వ జయంతిని పురస్కరించుకుని చేపట్టారు. ఈ ప్రాజెక్టు 2025 జనవరిలో ప్రారంభం కానుంది. ప్రతి ఏడాది 55,400 యూనిట్ల శుద్ధమైన విద్యుత్ ఉత్పత్తి చేయనుంది. 600 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించనుంది. గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ గగన్ కోహ్లీ మాట్లాడుతూ ఈ 400 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ 'సోలారిస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

గాలి నాణ్యతలోపం కారణంగా ఆరోగ్య సమస్యలు

హైదరాబాద్: చలికాలం ప్రారంభమై నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పౌరులలో ఆరోగ్య సమస్యలు పెరగడానికి వైద్యులు పేలవమైన గాలి నాణ్యత, తక్కువ ఉష్ణోగ్రత ప్రధాన కారణమని పేర్కొన్నారు. నిజాంపేట్‌లోనిఅపోలో క్లినిక్ ఫ్యామిలీ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ సౌజన్య మంత్రిప్రగడ మాట్లాడుతూ రోగులలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పెరగడాన్ని గమనించినట్లు తెలిపారు. 'గత కొన్ని వారాల్లో, కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 40-50శాతం మంది రోగులు శ్వాసకోశ లక్షణాలతో మా దగ్గరికి వస్తున్నారు. ఎగువ, దిగువ రెసిపరేటరీ ట్రాక్ట్ అంటువ్యాధులు, బ్రోన్చియల్ ఆస్తమా, సీఓపీడీలక్షణాలు గమనించబడ్డాయి. శ్వాసకోశ వ్యాధికారక క్రిముల వ్యాప్తి వలన ఎక్కువ మంది వ్యక్తులు ఆసుపత్రిలో చేరాల్సివచ్చే జబ్బుల బారిన పడుతున్నారు.' అని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం, ఊపిరి ఆడకపోవడం వంటివి రోగులలో సర్వసాధారణమైన ఫిర్యాదులలో ఉన్నాయని డాక్టర్ మంత్రిప్రగడ తెలిపారు.

స్నాప్ డ్రాగన్ ఎల్కెట్ ఫ్లాగ్‌షిప్‌తో రియల్‌మీ జి టి 7 ప్రొ విడుదల

హైదరాబాద్: రియల్‌మీ అనేది అత్యంత యువతలో అత్యంత పేరుగాంచిన బ్రాండ్. అది తాజాగా చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్న రియల్‌మీ జి టి 7ప్రొని భారత దేశపు మొట్టమొదటి స్నాప్ డ్రాగన్ 8 ఎల్కెట్ ఫ్లాగ్‌షిప్ చిప్‌సెట్‌తో పరిచయం చేసింది. "పుట్టిందే అధిగమించడానికి" అనే గమ్యంతో ప్రతి తరం జి టి డిజైన్ చేయబడినది. అది ఎక్కడా చూడని పనితీరుని అందిస్తుంది. అది సాధ్యమైనంతవరకు పరుధులను వెనక్కి నెడుతూ ఎక్కడా చూడని పనితీరుని అందించడానికి సహాయపడుతుంది. రియల్‌మీ జి టి 7 భారత దేశంలో స్నాప్ డ్రాగన్ 8 ఎల్కెట్ ఫ్లాగ్ షిప్ చిప్సెట్ ఫీచర్‌ని అందించే మొదటి పరికరం. అది పనితీరుకి కొత్త ప్రమాణాలను సెట్ చేస్తుంది. అది ఆన్ టు టు స్కోర్ తో 3 మిలియన్ల మందికి మెరుగైన పనితీరుతో నిలుస్తుంది. ఫోటోలు తీసుకోవాలి అనుకునే వారికి రియల్ మీ జి టి 7ప్రొ సోనీ ఐఎంఎక్స్ 882 పెరిస్కోప్ కెమెరాతో వస్తుంది. రియల్‌మీ జి టి 7 మార్స్ ఆరెంజ్, గెలాక్సీ గ్రే అనే రెండు ఆకర్షణీయమైన రంగులలో అందుబాటులో ఉంటుంది. అది 56,999 రూపాయలకు 12జీబీ+256జీబీ, 62,999 రూపాయలకు 16జీబీ+512జీబీతో రెండు స్టోరేజ్ రకాలలో కూడా అందుబాటులో ఉంటుంది.

డిజిటల్ మీడియా మార్కెటింగ్‌పై కెఎల్‌హెచ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్: డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్‌పై రెండు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ (సీబీపీ)ని ప్రారంభించినట్లు కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్, హైదరాబాద్ వెల్లడించింది. న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్)చే స్పాన్సర్ చేయబడిన సీబీపీ 2024 డిసెంబర్ 2 నుండి 14 డిసెంబర్ వరకు జరగనుంది. యుజిసి గుర్తింపు పొందిన భారతీయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలలో సామాజిక శాస్త్ర విభాగాల నుండి కెరీర్ తొలినాళ్లలో ఉన్న ఉపాధ్యాయులకు మద్దతు ఇవ్వడానికి, అకడమిక్ సర్కిల్స్‌లో అధునాతన డిజిటల్ మార్కెటింగ్ విద్య క్లిష్టమైన అవసరాన్ని పరిష్కరించడం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం రూపొందింది. ఈ కార్యక్రమం తెలంగాణ, హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుండి సమతుల్య ప్రాతినిధ్యంతో భారతదేశం అంతటా జాగ్రత్తగా ఎంపిక చేయబడిన 30 మంది విద్యావేత్తలతో కూడిన ఎంపిక చేసిన బృందాన్ని తీసుకువస్తుంది.

మెరిల్ 'మైవల్ ఆక్టాప్రో టీహెచ్‌వీ' హార్ట్ వాల్వ్ ఆవిష్కరణ

హైదరాబాద్: కార్డియోవాస్కులర్, స్ట్రక్చరల్ హార్ట్ సొల్యూషన్స్‌లో ప్రత్యేకత కలిగిన ప్రముఖ గ్లోబల్ మెడ్-టెక్ కంపెనీ, మెరిల్ లైఫ్ సైన్సెస్, జీఐఎస్ఈ 2024 (నేషనల్ కాంగ్రెస్ అఫ్ ద ఇటాలియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ), పిసిఆర్ లండన్ వాల్వ్స్ 2024లో మైవల్ ఆక్టాప్రో ట్రాన్స్‌కాథెటర్ హార్ట్ వాల్వ్ (టీహెచ్‌వీ)ని విడుదల చేయటం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. స్ట్రక్చరల్ హార్ట్ కేర్‌ను ముందుకు తీసుకువెళ్లడంలో తమ నిబద్ధతను ప్రదర్శించడానికి ఒక ఆదర్శవంతమైన వేదికను ఈ శాస్త్రీయ కార్యక్రమాలు మెరిల్‌కు అందించాయి. ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ విధానాలకు అందిస్తున్న వినూత్నమైన సహకారానికి ప్రసిద్ధి చెందిన మైవల్ టీహెచ్‌వీ సిరీస్, మైవల్ ఆక్టాప్రో టీహెచ్‌వీతో కొత్త బెంచ్‌మార్క్‌లను నిర్దేశించడం కొనసాగిస్తోంది. ఈ తాజా పునరుక్తిలో ఫ్రేమ్ ఫోర్‌షార్టెనింగ్‌ను పరిచయం చేస్తుంది. ఆపరేటర్ నియంత్రణను మెరుగుపరుస్తుంది.

డిస్కౌంట్ బ్రోకింగ్ 'షీట్స్'ను ప్రవేశపెట్టిన షేర్ మార్కెట్

ముంబయి: మార్కెట్ కార్యకలాపాలలో పాలుపంచుకునే వారికి శక్తినిచ్చి, వారి ట్రేడింగ్ అనుభవాన్ని మెరుగుపరిచేలా డిస్కౌంట్ బ్రోకింగ్ రంగంలోనే మొదటిసారిగా షీట్స్‌ను ఆవిష్కరిస్తున్నామని ఫోన్‌పే ప్రోడక్ట్ అయిన షేర్.మార్కెట్ ప్రకటించింది. వెబ్ ప్లాట్‌ఫామ్ అయిన ట్రేడ్.షేర్.మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఈ షీట్లు మార్కెట్ డేటాను నేరుగా ఒక స్ప్రెడ్ షీట్‌లోకి దిగుమతి చేసుకుని, తమ సొంత ట్రేడింగ్ నమూనాలు, వ్యూహాలను క్రియేట్ చేసుకురావడం ద్వారా ట్రేడర్లకు సహాయపడుతాయి. షీట్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఈ రంగంలో కొత్త విప్లవాన్ని తీసుకురావడమే కాక, దేశంలోనే ఇలాంటి వినూత్నమైన ఫీచర్ అందించే ఏకైక డిస్కౌంట్ బ్రోకర్‌గా షేర్.మార్కెట్ అవతరించింది. ఈ అత్యాధునిక టూల్ మార్కెట్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న వారు తమ తెలివి తేటలకు పదును పెట్టుకుని, మార్కెట్ కార్యకలాపాల్లో చేపట్టాల్సిన చర్యలను తెలుసుకోవడంలో సహాయపడుతుంది.

భారతి ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భాగస్వామ్యం

ముంబయి : ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్‌బీ), భారతదేశంలో అతిపెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్, భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఒకటి. భారతీ లైఫ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (భారతి గ్రూప్) పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ, వ్యూహాత్మక బ్యాంక్ అస్యూరెన్స్ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ సహకారం ఏయూ ఎస్ఎఫ్‌బీ వినియోగదారులకు విస్తృతమైన జీవిత బీమా, ఆర్థిక భద్రతా పరిష్కారాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ముంబైలో జరిగిన కార్యక్రమంలో, ఎఏయూ ఎస్ఎఫ్‌బీ డిప్యూటీ సీఈవో గ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ తిబ్రేవాల్, భారతి ఆక్సా లైఫ్ ఎండీ, సీఈవో పరాగ్ రాజా ఈ ఇన్సూరెన్స్ ఒప్పందంపై సంతకం చేసి, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించారు.

ఘనంగా శాంటా మారియా ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్

హైదరాబాద్: శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో శాంటా మారియా ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌కు హైదరాబాద్‌లోని కేంబ్రిడ్జ్ స్కూళ్ల విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫెస్టివల్‌లో చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు జరిగాయి. ఇవి విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీశాయి. ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా ఆడారు. ఆసక్తికరంగా రేసులు, జట్టు ఆటలు, తల్లిదండ్రులు - విద్యార్థుల సవాళ్లు ఆకట్టుకున్నాయి. ఇవన్నీ టీమ్ వర్క్‌ను ప్రోత్సహించాయి.

అపోలో హాస్పిటల్స్ అరుదైన రికార్డు

హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ అరుదైన రికార్డు సృష్టించింది. 24 రోజుల్లో 25 క్లిష్టమైన స్లీప్ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్సలు చేసింది. ఒకే రోజు రెండు శస్త్రచికిత్సలు చేయడం ప్రపంచంలోనే అరుదైన ఘనతగా చెప్పవచ్చు. అది కూడా 24 గంటలలో డిశ్చార్జితో డాక్టర్ ధనుంజయరావు గింజుపల్లి ఆధ్వర్యంలో ఈ రికార్డు స్థాయి శస్త్రచికిత్సలు జరిగాయి. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మీడియా సమావేశంలో అపోలో హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ మూమెంట్ డిసార్డర్స్ వంటి పార్కిన్సన్స్ వ్యాధి, ఎసెంషియల్ ట్రెమర్స్, డిస్టోనియా లాంటి వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో ఈ వ్యాధుల సంఖ్య అధికంగా ఉన్నాయన్నారు. పార్కిన్సన్స్ వ్యాధి దేశంలో పది లక్షల మందికి పైగా ప్రభావితం చేస్తుందన్నారు. ఇది భారతదేశాన్ని న్యూరాలజికల్ వ్యాధుల ప్రధాన కేంద్రంగా మార్చుతుందని చెప్పారు. దీనిని నివారించేందుకు అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ ఫాస్ట్ ట్రాక్ డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) శస్త్రచికిత్సను ప్రవేశపెట్టిందని తెలిపారు.

సంపాదకీయం

మసీదుల కింద భగవదన్వేషణ

ఎంతో తపస్సంపన్నులకు తప్ప భగవంతుడు కనిపించడు అంటారు. కానీ హిందూ హృదయ సామ్రాట్ ఏలుబడిలో భగవంతుడి పత్తా క్రమంగా దొరికిపోతోంది. మసీదుల కింద దేవాలయాలు కోసం వెదకడం మొదలైంది. అది నిజమో కాదో తెలియదు కానీ తవ్వకాలైతే జోరుగా సాగుతున్నాయి. వారణాసిలో దేవుడికోసం అన్వేషణ సాగింది. అజ్మీర్ షరీఫ్‌లోనూ అదే జరుగుతోంది. మథురలో, భోజ్‌శాలలో కూడా అదే పనిలో ఉన్నారు. దేవుడు పైన ఎక్కడో ఉంటాడని ఇంతవరకు భక్తులు విశ్వసించే వారు. దేవుడి మీద విశ్వాసం ఉన్న వారు పైకి చూస్తూ "ఓరి భగవంతుడా" అని మొక్కుకుంటారు. ఇప్పుడు దేవుడు భూమి మీదకు దిగివచ్చినట్టున్నాడు. మసీదులు, దర్గాల కింద దేవాలయాలు, భగవంతుడి కోసం వెతుకులాట కొనసాగుతోంది. మసీదులు, దర్గాల కింద గుళ్లు గోపురాలు, దేవుడు ఉన్నాడని అర్జీలు పెట్టుకుంటున్నారు. న్యాయస్థానాలు అన్వేషణకు అనుమతులిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాలు భగవంతుడి అన్వేషణలో నిమగ్నమైపోయాయి. పరమాత్ముడు ఎక్కడైనా ఉంటాడన్నప్పుడు మసీదులు, దర్గాల కింద కూడా ఉండడంలో ఆశ్చర్యం ఏముంది? ప్రతి కణంలో భగవంతుడున్నప్పుడు మసీదుల కింద ఉండడనే తర్కాన్ని ఎలా కాదనగలం! ఇలా అన్వేషిస్తున్నప్పుడు రాళ్లు విసరడం ఏమిటో! అజ్మీర్ షరీఫ్ దర్గా నిజానికి శివాలయం అన్న అర్జీ దాఖలైంది. రాజస్థాన్ కోర్టు ఆ పిటిషన్ విచారించడానికి అంగీకరించింది. దర్గా కమిటీకి, భారతీయ పురాతత్వ శాఖకు, అల్పసంఖ్యాక మంత్రివర్గానికి నోటీసులు జారీ చేసింది. సర్వే చేయించడానికి సిద్ధపడింది. ఎన్నికల సమయంలో భగవదన్వేషణ తీవ్ర స్థాయిలో కొనసాగుతుంది. గోదీ మీడియా ఈ సమాచారాన్ని, వివరాలను పొల్లుబోకుండా ప్రచురిస్తుంటుంది. ప్రసారం చేస్తుంది. అజ్మీర్ షరీఫ్‌లో ఖాజా మొయినుద్దీన్ చిష్టీ దర్గా కింద దేవాలయం ఉందని మధ్యాహ్నం అర్జీ దాఖలు చేస్తే వెంటనే కోర్టు దాన్ని విచారణకు స్వీకరిస్తుంది. పురాతతత్వ శాఖ సర్వే ప్రారంభిస్తుంది. ముస్లింలపై దాడులు, మూక హత్యలు గత పదేళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఇది సంఘ్ పరివార్ ఎజెండా అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అజ్మీర్ దర్గా కింద శివాలయం ఉందన్న వాదన మూడేళ్ల నుంచి కొనసాగుతూనే ఉంది. ప్రకటనల మీద ప్రకటనలు జారీ చేస్తూనే ఉన్నారు. అజ్మీర్ షరీఫ్ దర్గా దాదాపు 400 ఏళ్ల నుంచి ఉంది. ఇక్కడికి వచ్చే వారు కేవలం ముస్లింలే కాదు. అన్ని మతాలవారు ఈ దర్గా సందర్శిస్తారు. ఈ దర్గాను "సంకట్ మోచన్ మహాదేవ్" దేవాలయంగా ప్రకటించాలని హిందూ సేనకు చెందిన విష్ణు గుప్తా పిటిషన్ దాఖలు చేశారు. విష్ణు గుప్తాకు దర్గా కింది హరిహర దేవాలయం ఉన్నట్టు కల వచ్చిందట. ఆ కల ఆధారంగా ఆయన పిటిషన్ దాఖలు చేశారు. విజ్ఞుడైన జడ్జి దాన్ని విచారించడానికి అంగీకరించారు. ఇందులో విష్ణు గుప్తా మత రాజకీయ చదరంగంలో చిన్న పావు కావొచ్చు. దీని వెనక పెద్ద ప్రణాళిక ఉందనడం మాత్రం సత్యం. ఈ దర్గాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నింటీ రద్దు చేయాలని కూడా అభ్యర్థించారు. ఈ దర్గా పర్యవేక్షణ ప్రధాన ద్వారం హిందూ వాస్తు శాస్త్రానికి అనుగుణంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. సంభల్‌లో ఇటీవలే మత కలహాలు జరిగాయి. అక్కడ కూడా వివాదం మసీదు కింద మందిరం ఉందనేదే. షాహీ ఈద్గా, జ్ఞానవాపి, బెంగాల్ లో ఉన్న భారత ఉపఖండంలోకెల్లా అతి పెద్దదైన అదీనా మసీదు అన్ని వివాదాస్పదమైపోయాయి. తాజ్ మహల్, ఎర్రకోట, బులంద్ దర్వాజా లాంటి మొగలుల కాలం నాటి నిర్మాణాలు వివాదాలకు అతీతంగా లేవు. ఇవన్నీ చారిత్రక కట్టడాలు అన్న జ్ఞానం అర్జీదారులకు లేకపోవడంలో ఆశ్చర్యం లేకపోవచ్చు. కానీ ఈ అర్జీలను విచారణకు స్వీకరించే జడ్జీలకు ఇసుమంతైనా చారిత్రక జ్ఞానం, చట్టాల గురించి అవగాహన ఉండాలిగా! 1947 ఆగస్టు 15 కన్నా ముందు నుంచి ఉన్న ఆలయాలు, ప్రార్థనా మందిరాల మీద వివాదాలు లేవనెత్తడానికి వీలులేదని అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న పీవీ నరసింహారావు ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. ఇప్పుడు అలాంటి వాటి గురించే వివాదాలు లేవనెత్తుతూ పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని విచారణకు స్వీకరించడం ఆ చట్టాన్ని ఉల్లంఘించడమేనని జడ్జీలకు ఎందుకు తట్టదో అంతుపట్టదు. 1991 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం చట్టంలోనే ఉంది. అర్జీలు పెటుకున్న వారికి, వాటిని విచారించిన జడ్జీలకు ఈ చట్టం కింద శిక్ష పడ్డ దాఖలాలు ఎక్కడా లేవు.

ఇంకా విచిత్రం ఏమిటంటే ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలైనాయి. వీటిలో ఒక పిటిషన్ బీజేపీకి చెందిన న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ, మరో పిటిషన్ బీజేపీ ఎంపీ డా. సుబ్రహ్మణ్యం స్వామి వేశారు. వీరు ఇలాంటి అంశాల మీదే పిటిషన్లు దాఖలు చేయడంలో నిమగ్నమై ఉంటారు. అడిగే వారు లేరు. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ పురాతత్వశాఖ సర్వే చేయాలని ఆదేశించిన తరవాతే మతకలహాలు చెలరేగాయి. అజ్మీర్ షరీఫ్ గురించి పిటిషన్ దాఖలు చేసిన విష్ణు గుప్తా షరా మామూలుగా హరిహర మందిరం కూల్చి మసీదు నిర్మించారనే వాదిస్తున్నారు. 1911లో ఉద్యోగ విరమణ చేసిన హర్ విలాస్ షారద అనే జడ్జీ రాసిన గ్రంథం విష్ణు గుప్తా పిటిషన్‌కు ఆధారమట. అజ్మీర్ షరీఫ్, బులంద్ దర్వాజాలో కూడా హిందూ వాస్తు విశేషాలు కనిపించాయట. శివాలయం కూల్చిన శిథిలాలను వినియోగించే దర్గా నిర్మించారట. అంతే కాదు ఆ ప్రార్థనా మందిరం మధ్య భాగంలో జైన మందిరం ఉందనీ ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అంటే జైన మందిరం ఉన్న చోటే హరిహర మందిరం నిర్మించాలనుకోవాలా? మసీదుల్లో విగ్రహాలు ఉండనట్టే దర్గాల్లో ముస్లిం మత పెద్దల సమాధులు మాత్రమే ఉంటాయి. వీటిని సందర్శించేది కేవలం ముస్లింలే కాదు. హిందువులు, ఇతర మతాలవారు దర్శించుకుంటారు. ఒక రకంగా దర్గాలు భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణం. అఫ్గానిస్థాన్ నుంచి ఇండోనేషియా దాకా అజ్మీర్ దర్గాను లక్షలాది మంది సందర్శిస్తారు. మసీదులు, దర్గాల కింద ఆలయాలు ఉన్నాయన్న ఫిర్యాదులు మత సామరస్యాన్ని భగ్నం చేయడానికి మాత్రమే ఉపకరిస్తాయి. మతోన్మాదం పెరిగిపోయిన దశలో ఈ వివాదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. వందల ఏళ్ల కిందటి మసీదులను లక్ష్యంగా చేసుకుని వివాదాలు రేకెత్తించడం మతోన్మాదం తలకెక్కినవారు మాత్రమే చేయగలిగిన పని. ఆ పని వెనక బీజేపీ రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయి.

డైరీ రాజకీయం

రా బావ ఏంటి చేతిలో రెడ్ కలర్ డైరీ పట్టుకుని బయలుదేరావు. ఇదేదో ఉగ్రవాద రాజకీయంగా ఉంది. అవును బావ ఇది ఉగ్రవాదం కంటె ఘోరమైనదే. అదిసరే నీవేమి ఎర్ర డైరీ పట్టుకున్నావ్. మొన్న రాంబాబు నల్ల డైరి పట్టుకుని వచ్చాడు. ఏంటయ్యా అంటే ఎర్ర డైరీలో మా పేర్లు వుంటే మా నల్ల డైరీలో మా విరోధుల పేర్లు ఉంటాయి. మా పేర్లన్నీ ఎర్ర డైరీలో ఉన్నాయంట. మీ బావ ఎర్ర డైరీ విప్పి అందులో పేర్లున్న మమ్మలందరిని ఒక్కొక్కడిని లేపేస్తాడంట. అధికారం ఎల్లకాలం ఈ ఎర్ర డైరీ వాళ్ల చేతుల్లోనే ఉండదు కదా. మాకు అధికారం రావడానికి అయిదేళ్లు అవసరం లేదంట. ఇంకో రెండేళ్లు ఆగితే చాలు అపుడు మా నల్ల డైరీ తెరచి ఒక్కొక్కడిని సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకుని వాడి సంగతి తేలుస్తాం అంటూ చాలా కోపంగా రాంబాబు వెళ్లాడు. అలాగా చావుకు ముందు బాధలు భరించలేక పెద్దగా అరుస్తారు కదా అటువంటి అరుపుల వాళ్లకు మా రెడ్ డైరీ ఓపెన్ చేశాం నలుగురిని లోపల వేయడం కూడా జరిగిపోయింది. లోపల వేస్తే పరవాలేదు బయట ఎలాగూ పార్టీ పనులు లేవు కాని లోపల పడేసి లాఠీలకు పని చెప్పకుండా ఉంటే చాలు అన్నట్లుగా వాళ్ల ధోరణి కనబడుతోంది.

అదిసరే బావ అసలు ఈ డైరీల రాజకీయం ఏంటి కొత్తగా. గతంలో పార్టీ పాలసీలపైన, విధానాల పైన, పత్రికల స్టేట్‌మెంట్ల ద్వారా, బహిరంగ సభల ద్వారా విమర్శించుకుంటుంటే చదవడానికి, వినడానికి ఆసక్తికరంగా ఉండేవి. ఇప్పుడు డైరీలేంటి, లాఠీలేంటి నాకు వినడానికి కూడా బాధగా ఉంది. అసలు రాజకీయం ఎటువైపు పయనిస్తుందో నాకు చాలా భయంగా ఉందయ్యా. ఇంతకీ ముందు రెడ్ డైరీ అంటూ మొదలుపెట్టింది నీవే కదా. అసలు ఎందుకిలా మొదలుపెట్టావు. రోజూ పేపరు చదువుతావు కదా నీకు

వివేచన

– బండారు రాధాకృష్ణ

తెలియదా. వాళ్లు పార్టీ విధానాలపై విమర్శ వదలి ఇంట్లో ఉన్న ఆడవాళ్లపై నోటితో చెప్పలేని అసభ్యకర పోస్టింగులు పెట్టడం నీకు తెలియదా! అసలు నన్ను, నా పార్టీని వదిలి, నా ఇంట్లో ఆడవాళ్ల సంగతి వాళ్లకెందుకు చెప్పు. ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చింది. అందుకే నన్ను, మా ఆడవాళ్లను మా పార్టీ కార్యకర్తలను అల్లరి చేసిన వారిపై కక్ష తీర్చుకోవడానికి ఎర్ర డైరీ వాడుతున్నా. నా డైరీలో పోలీసులూ ఉన్నారు. తెలుసు బావ ఆట మొదలుపెట్టావు కదా. మరి చేతిలో పవరు ఉంచుకుని కూడా పూరుకోమంటావా. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు చేసినవన్నీ విన్నావుగా. అది సరే రాంబాబు ఇప్పుడున్న అధికారం వాళ్లకు శాశ్వతం కాదు. రెండు మూడేళ్లు ఓపికపడితే మేం అధికారంలోకి వచ్చిన తరువాత మా బ్లాకు డైరీలోకి ఎక్కిన వారందరి సంగతి తేలుస్తాం అంటున్నాడు. నాకు తెలియక అడుగుతాను అసలు రాజకీయమంటే ఎన్నుకున్న ప్రజల సమస్యలు తీర్చడమా లేక ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడమా చెప్పు. ఏంటయ్యా చెప్పేది వాళ్లు అధికారం అడ్డం పెట్టుకుని ఇష్టమొచ్చినట్లు దోచుకుని ఖజానా ఖాళీచేసి వెళ్లారు. అంతటితో తృప్తిపడక కుటుంబంలోని స్త్రీల జోలికి ఎందుకొచ్చారు చెప్పు. మా మనసు ఎంత బాధపడిందో ఊహించు. అంతెందుకు మా అగ్ర నాయకుడు మీడియా ముందే ఏడ్చాడు. నువు చూశావు గదా. మనసు ఎంత బాధపడితే అలా అందరి ముందు ఏడుస్తాడో ఆ మాత్రం ఊహించుకో. నిజమేనయ్యా రాజకీయాలు తగలపడిపోతున్నాయి. ఎన్ని వందల ఫైరింజన్లు వచ్చినా ఈ మంటలను ఆర్పలేరు.

ప్రతి పార్టీ ఇతర పార్టీలను దోచుకుతిన్నావు, ఖాళీ ఖజానా మిగిల్చావు అనడమేగాని ప్రత్యర్థి పార్టీ అయినా మంచిపని చేసిందని అనడం నేను వినలేదయ్యా. అసలు సంపాదన కోసమే రాజకీయాలు తప్ప ప్రజాసేవ కోసం కాదని ఒకరిని మించి ఒకరు నిరూపిస్తున్నారు. ఎదురు పార్టీని బాగా తిట్టిన వాడికి పార్టీలో పదవులు దక్కుతున్నప్పుడు అలాంటి ఆచరణకే అందరూ మొగ్గు చూపుతున్నారు. ప్రజల సమస్యలపై ఎలా పోరాటం చేయాలనేది ఎవరికి అవసరంలేదు. మంత్రులను, పేరున్న నాయకులను అంటకాగి వెంట తిరిగి ఆ నాయకుడు ఎలా సంపాదించాడనే విషయం తెలుసుకుని అలాగే ఆచరించడానికి యువత ఆరాటపడుతోంది. నిజమే, ఒక్క అదానీ వల్ల ఎంత మంది రాజకీయ నాయకులకు దేశ వ్యాప్తంగా లబ్ధి చేకూరిందో చూస్తున్నాం గదా. అదిసరే బావ ఒకవేళ రాజకీయాలలో నిష్ఠాతులైన పుచ్చలపల్లి సుందరయ్య, డాంగే, కృపలాని లాంటి వాళ్లు మన దేశం ఎలా ఉందో చూద్దామని తిరిగివస్తే ప్రస్తుత రాజకీయాలు, నడుస్తున్న చరిత్ర చూస్తే వారి గుండె ఆగిపోతుందనుకో. అసలు ఆంగ్లేయులపై పోరాటం చేసి జైలుకు వెళ్లి ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్ర్యం సంపాదించింది ఇందుకేనా అని తల పట్టుకుంటారనుకో.

అసలు అదానీ లాంటి వారి మీద, అదానీ లాంటి వారిని పెంచి పోషిస్తున్న రాజకీయ నాయకుల పైన డైరీలు తయారవ్వాలి. అటువంటి వారిని పోషించే వారిని నక్సలైట్లు తప్ప మరెవరు పట్టించుకోవడం లేదు. ఇటువంటి వారిపై విచక్షణారహితంగా న్యాయమూర్తులు తీర్పులివ్వాలి. అది సరేగాని ఈ డైరీల భారతం పెరిగిపోయి వైరి పక్షాన్ని దెబ్బ తీసేందుకు ఉభయపక్షాలు రౌడీలను పోషించే ఆలోచన కూడా చేస్తాయా. భలేవాడివయ్యా ప్రస్తుతం రాజకీయ పార్టీలలో వారు లేకపోతే గద కొత్తగా తయారుచేసుకునేది. గత కొంతకాలంగా రౌడీలను అస్మదీయులుగా అక్కున చేర్చుకుంటున్నారుగా. ఇంకా కొత్తగా పెంచి పోషించవలసిన అవసరమేముంది. మన దేశంలో మేధావులను చంపించింది వారితోనే కదా. పన్సారే, కల్బుర్గి లాంటి మేధావులను హతమార్చారు కదా. సమాజ హితం కోరి అన్యాయాన్ని ఖండించే మేధావులను బీజేపీ ప్రభుత్వంలో చంపిన సంగతి తెలిసిందే గదా. ఏది ఏమైనా వ్యవస్థ నాశనమవుతోంది. రాజకీయ నాయకులు, పోలీసులు జైలు పాలయితే ఇక సమాజాన్ని కాపాడేదెవరు. సమాజం ఎటు పోతోందో అర్థం కావడంలేదు.

సెల్: 9885569394

వామపక్ష పటిష్టత తక్షణ అవశ్యం

డాక్టర్ దత్తగుప్త, కలకత్తా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్.
భానుదేవ్ దత్తా, పశ్చిమబెంగాల్ వెటరన్ సీపీఐ నాయకులు

నూతన ఆలోచనా విధానంతో దేశంలో వామపక్షం పటిష్టవంతం కావలసిన తక్షణ అవశ్యకత ఎంతైనా ఉంది. ముందుగా మూడు కమ్యూనిస్టు పార్టీలు కలిసి వామపక్షం బలోపేతం కావడానికి కృషి చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మతం, దాని ఆచరణలపై పోరాటం చేయాలి. ప్రస్తుతం భారత్‌లో వామపక్షాల పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇటువంటి పరిస్థితి ఏనాడూ లేదు. ఇదొక అసాధారణమైన పరిస్థితి. మితవాద శక్తుల చేతుల్లో అధికారం క్రమంగా కేంద్రీకృతమవుతున్నది. వామపక్షం వేగంగా బలహీనపడటం తీవ్ర ఆందోళనకలిగించే అంశం. అంతర్జాతీయంగా చూసినట్లయితే పశ్చిమదేశాలలో ప్రధానమైన కమ్యూనిస్టుపార్టీలు తమ ఉనికిని దాదాపు కోల్పోయాయి.

భారత్‌లో 18వ లోక్‌సభ ఎన్నికలు (2024 తర్వాత వామపక్షం) ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్యంతోకలిసి పోటీ చేసిన రాష్ట్రాలలో ప్రాథమికంగా ప్రయోజనం కలిగింది. వామపక్షం స్వతంత్ర రాజకీయ శక్తిగా ఉన్నప్పుడు ప్రజలు ఓట్లు వేయడానికి సిద్ధపడతారని చెప్పడం సరికాదు. గ్రాండ్ అలయన్స్‌తో కలిసి ఉన్నప్పుడే ఓట్లు వచ్చే అవకాశం ఉంటుంది. వామపక్షం కాంగ్రెస్‌తో సంబంధాలను వదులుకోవాలి. మరో విధంగా చెప్పాలంటే వామపక్షం భిన్నంగా ఉన్నప్పుడు ప్రజలు ఓటువేసేందుకు సిద్ధంగా లేరు. ఇండియా అలయన్స్‌లో ఉన్న ప్రధాన పార్టీలు (సమాజ్‌వాది పార్టీ, డిఎంకె, కాంగ్రెస్, టీయంసి, ఆర్‌జేడీ) రాజకీయంగా ప్రయోజనం పొందాయి. ఇదే సమయంలో వామపక్షాల సామర్థ్యత ఏమీ కనిపించలేదు. కాంగ్రెస్ అత్యధికంగా ప్రయోజనం పొందింది. కమ్యూనిస్టుపార్టీల పట్ల సీట్ల కేటాయింపు విషయంలో ఏమాత్రం పట్టించుకోలేదు. అంటే వామపక్షాల పరిస్థితి బలహీనంగా ఉన్నదనేదే నిర్ణయం. అయితే దీని అర్థం ఎన్నికల రాజకీయాల్లో కాంగ్రెస్‌తో వామపక్షం సంబంధం వదులుకోవాలని కాదు. బీజేపీపై పోటీకి కాంగ్రెస్‌తో ఎన్నికల్లో అలయన్స్‌కు కృషి చేయాలి. వివిధ అంశాలపై వామపక్షాలు బలహీనపడేందుకు కాకుండా పోరాడేందుకు కాంగ్రెస్‌తో కలవవచ్చు.

మితవాద శక్తులతో కలసి ఉన్న కూటమికి వ్యతిరేకంగా ఉండేందుకు కీలకమైన అంశం ఏమిటి? వామపక్షం లేదా వామపక్షేతర కాంగ్రెస్‌లాంటి బూర్జువా పార్టీలతో కలిసిపోరాడేందుకు కీలకమైన అంశం ఉండాలి. వామపక్షేతరపార్టీలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీపై పోరాడలేవు. ఈ విషయాన్ని అంగీకరించి తీరాలి. ఎందుకంటే వీటికి దాదాపు ఏమాత్రం సైద్ధాంతిక ఆలోచనా విధానంలేదు. ఈ బూర్జువా పార్టీలన్నింటికీ హిందుత్వ పట్ల మెతకదనం అనే బలహీనత ఉంది. మనం మితవాదశక్తులతో నిరంతరం పోరాడినట్లుగా ఇతర విశ్వసనీయశక్తులు లేవు. ఇక్కడే వామపక్షశక్తులు కీలకమైన పాత్రను నిర్వహించాలి. ఎందుకంటే మితవాద శక్తుల నిర్మాణాత్మకంగా అదే సమయంలో సైద్ధాంతికంగా వామపక్షం మాత్రమే పోరాటం చేయగలవు. ఈ నేపథ్యంలో మితవాదశక్తుల కూటమికి వ్యతిరేకంగా సమర్థంగా పోరాడేందుకు వామపక్షం బలోపేతం కావాలి. వామపక్షం కీలకమైనశక్తిగా ఎదగాలంటే ముఖ్యమైన షరతు కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ) కింద వామపక్షం ఐక్యంకావాలి. అయితే ఇదంత తేలికైన లక్ష్యంకాదు. సీఎంపీ ఆధారంగా సమన్వయ యంత్రాంగం ద్వారా వామపక్షం ఏకం కావలసిన అవసరం ఉన్నది. సోవియట్ పాలనాకాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం అందులో అనేక లోపాలు ఉన్నప్పటికీ అది ప్రపంచశక్తిగా ఉంది. పెట్టుబడీదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా వామపక్షం ప్రజల గుర్తింపు కలిగి ఉంది. ప్రస్తుతం ఇది సాధ్యంకాదు. ఇప్పుడు మితవాదశక్తి అజెండాను రూపొందించే స్థితిలో ఉంది. ప్రత్యామ్నాయ ఇండియాగా ఈ అజెండా ప్రజలముందు నిలిచిఉంది. అత్యధిక ప్రజలను ఆకర్షించింది. ఈ విధమైన వ్యూహం వలన వీరికి రాజకీయ ఫలితాలు లభించాయి. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులలో మితవాదశక్తులు 2024లో పెరుగు తున్నాయి. మరి ఈ దశలో వామపక్షశక్తుల లక్ష్యాలు ఏమిటి? సోవియట్ హయాంలో అనుసరించిన అనేక భావజాలాలను తీవ్రంగా పరిగణించడం ప్రారంభించాలి. సోవియట్ మోడల్ అంతగా క్లిష్టంకాని సార్వజనీనమైనది. దీనికి వ్యతిరేకమైన విధానాన్ని లెనిన్ హెచ్చరించారు. పునరాలోచించాలని డిమాండ్ చేశారు. కనీసం ఇలాంటి మూడు అంశాలను గుర్తించవచ్చు. ఒకటి: కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అంగీకరిస్తూనే, మరొక సమస్యను అనుసరించలేం. అదేమిటంటే, తక్కువ గొంతుకలు పార్టీ దిగువస్థాయి వరకు చేరడం లేదు. అయితే ఇక్కడ కోల్పోయిన దేమిటంటే ప్రజాస్వామ్య స్ఫూర్తి. పార్టీ సభ్యులకు తప్పుడు అభిప్రాయం ఒకటి ఉంది. అన్ని నిర్ణయాలూ పైస్థాయిలోనే ఏకగ్రీవంగా తీసుకుంటున్నారు. ఏ స్థాయిలోనూ అసమ్మతిని తెలియజేయడంలేదు. రెండు: పార్టీ అగ్రనాయకత్వం ఈ విధానాలపై పునరాలోచించాలని డిమాండ్ చేస్తుంది. ప్రపంచంలో నేడు కార్మిక సమూహాల పోరాటం బహువిధంగా పెరుగుతోంది. ఇండియా విషయంలో వర్గ గుర్తింపు అనేక విషయాలలో ద్వితీయస్థానమే. విశాలమైన అలయన్స్‌లో కమ్యూనిస్టుపార్టీలు భాగస్వాములుగానే ఉంటాయిగానీ అగ్రగామి స్థానం ఉండదు. అనేక విషయాలలో పోరాటాలు సమస్య ఆధారంగా, ఆకస్మికంగా పౌరసమాజ సంస్థల బానర్ కింద ఏ పార్టీ అయినా ప్రారంభించలేదు. అయితే ఒక సమస్య తలెత్తుతున్నది. మనకు చరిత్రాత్మకమైన అనుభవం తెలియజేసిందేమంటే అకస్మికంగా మొదలయ్యే నిరసన ఉద్యమాలు చివరికి పతనమవుతాయి. అదికూడా రాజకీయ సమస్య లేదా సైద్ధాంతిక నాయకత్వం లేకపోతేనే పతనమవుతుంది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడం ఎలాగ? వామపక్షాల ముందు నిలిచిన కొత్త సవాలు ఇది. మూడు: మార్క్సిజానికి ప్రత్యామ్నాయాన్ని ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు సోషలిజం విషయంలో జరిగిన తప్పు ఏమిటి? అని అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సోవియట్ మోడల్‌లో సోషలిజం తరహా పార్టీ, కమ్యూనిస్టుపార్టీల పట్ల గల భిన్నత్వాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాము. ప్రజాస్వామ్యం, బహుళత్వం, మానవీయత ప్రజాసమూహాలకు ఇవి దూరంకావడం లాంటి పరిస్థితులను పార్టీలు గుర్తించలేదు. భారతదేశంలాంటి దేశంలో కమ్యూనిస్టుపార్టీలు ప్రజాసమూహాలను గుర్తింపుచేయగలగాలి. అనంతరమే మతం, నైతికత సరైన భావంతో తెలుసుకోవాలి. మంచి కమ్యూనిస్టుకి గుర్తింపు ఏమంటే...నిరాడంబరత, వ్యక్తిగత జీవితం అది ఎలా ఉండాలంటే నియమనిబంధనలు, కమ్యూనిస్టు నైతికత, ప్రమాణం ముఖ్యమైనవి. అప్పుడు మాత్రమే కమ్యూనిస్టు ప్రజాసమూహాలను, నైతికంగా మేధావి తరహాగా ప్రజలు గుర్తిస్తారు.అన్ని కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు ప్రజాసమూహాలను కమ్యూనిస్టు భావజాలంపైన చైతన్యపరచడం ద్వారా పార్టీని అభివృద్ధి చేయవచ్చు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ విభాగాలన్నీ నేటి పరిస్థితులను, అధికారాన్ని చలాయించే శక్తులపై సంఘటితంగా పోరాడేందుకు అనుగుణంగా అజెండాను రూపొందించి ఆచరణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టాలి.

> మార్క్సిజానికి ప్రత్యామ్నాయాన్ని ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు సోషలిజం విషయంలో జరిగిన తప్పు ఏమిటి? అని అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సోవియట్ మోడల్‌లో సోషలిజం తరహా పార్టీ, కమ్యూనిస్టుపార్టీల పట్ల గల భిన్నత్వాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాము. ప్రజాస్వామ్యం, బహుళత్వం, మానవీయత ప్రజాసమూహాలకు ఇవి దూరంకావడం లాంటి పరిస్థితులను పార్టీలు గుర్తించలేదు. భారతదేశంలాంటి దేశంలో కమ్యూనిస్టుపార్టీలు ప్రజాసమూహాలను గుర్తింపుచేయగలగాలి.

వ్యవసాయంలో 'డ్రోన్ల' సాంకేతికత

జనక మోహనరావు దుంగ

వ్యవసాయ ఆధారిత దేశమైన మన దేశంలో సుమారు 77% శాతం ప్రజానీకం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారానే ఉపాధి పొందుతున్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 17.5 శాతం ఈ రంగం ద్వారా సమకూరుతుంది. అనుకూలించని ప్రకృతి, పంట దిగుబడిలో క్షీణత, ఖరీదైన రసాయన మందులు వాడాల్సిరావడం, నైపుణ్యం ఉన్న మానవ వనరుల కొరత, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గడం లాంటి ఎన్నో ఒడిదుడుకులను రైతన్న పంట చేతికొచ్చేవరకు ఎదుర్కొంటున్నాడు. రాను రాను వ్యవసాయంపై అధిక ఖర్చు పెట్టవలసి వస్తోంది. మారుతున్న కాలంతోపాటు, పెరుగుతున్న జనాభాకి సరిపడా ఆహారం పండించాలన్నా, వ్యవసాయంలో పెరుగుతున్న వ్యవసాయ కూలీల కొరతను అధిగమించాలన్నా వ్యవసాయంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. ఈ నూతన సాంకేతికతలో వ్యవసాయ డ్రోన్లు ముందు వరుసలో ఉంటాయనేది కాదనలేని నిజం.

మెరుగైన సామర్థ్యంతో కూడిన డ్రోన్‌లు పెద్ద పంటపొలాలను త్వరగా సమర్థవంతంగా కవర్ చేస్తాయి. తద్వారా రైతులు డేటాను సేకరించడానికి, పంటలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తాయి. మెరుగైన ఖచ్చితత్వం కలిగిన అధిక రిజల్యూషన్ చిత్రాలు, డేటాను క్యాప్చర్ చేస్తాయి. ఇవి సమస్యలను ముందుగానే గుర్తించడంలో సహాయపడతాయి. వృక్షసంపద లేదా పంట, కలుపు మొక్కలు, అంటువ్యాధులు తెగుళ్ల వల్ల కలిగే పొలాల ప్రాంతాలను అంచనావేస్తాయి. వీటి ఆధారంగా సమస్యలను ఎదుర్కోవడానికి రసాయనాల ఖచ్చితమైన మొత్తాలను వర్తింపజేయడం ద్వారా మొత్తం ఖర్చును తగ్గించవచ్చు. నేల నాణ్యత, తేమ, పోషక స్థాయిలపై డేటాను అందిస్తాయి. పంట ఆరోగ్యంపై డేటాను సేకరించేందుకు, వాతావరణ పరిస్థితులను పర్యవేక్షించడానికి రైతులకు సూచనలు, సలహాలను అందించడానికి, కరువులు, వరదలు లేదా వడగళ్ల వానలు వంటి విపరీత వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. పంట ఎత్తు, దిగుబడిని కొలవడానికి ఖచ్చితమైన అంచనాలను అందించడానికి, వ్యవసాయ సరిహద్దులను మ్యాప్ చేయడానికి, భూమి రికార్డులను డిజిటలైజ్ చేయడంలో వినియోగించవచ్చు. డ్రోన్లో పురుగుమందులు, పోషకాలను నింపడానికి 5 నుంచి 10 కిలోల అధిక సామర్థ్యం కలిగిన మానవరహిత ట్యాంకు ఉంటుంది. సాంప్రదాయక ఎరువుల కంటే పంట ఉత్పాదకతను 8శాతం నుంచి 25శాతం పెంచి, పర్యావరణ ప్రభావాన్ని 50శాతం నుంచి 70శాతం వరకు తగ్గించే మరింత ప్రభావవంతమైన, పర్యావరణ అనుకూలమైన నానో యూరియా, నానో డీఏపీ లను సమర్థవంతంగా పిచికారీ చేయొచ్చు. డ్రోన్ కేవలం 15 నిమిషాల్లో దాదాపు ఎకరం భూమిలో పురుగుమందును ఏకరీతిగా పిచికారీ చేస్తుంది. ఇది రైతుల సమయాన్ని, డబ్బును ఆదా చేస్తుంది. ఇది పంట ఉత్పత్తిపై పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఏటవాలులు లేదా అధిక వోల్టేజ్ విద్యుత్ లైన్లు వంటి మానవులకు కష్టమైన లేదా ప్రమాదకరమైన ప్రాంతాలను చేరుకొని మానవ ప్రమాదాలను తగ్గిస్తాయి. విత్తనాలు, మొక్కలు ఇతర ఇన్‌పుట్‌లను పొలాలకు రవాణా చేయడానికి, రహదారి మౌలిక సదుపాయాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. రైతులు వారి పంటలను వివరణాత్మకంగా వీక్షించవచ్చు. వీటివలన తెగుళ్లు, వ్యాధులు, పంట నష్టాన్ని గుర్తించి నిరోధించడానికి, పంట నాణ్యత పరిమాణాన్ని మెరుగుపరచవచ్చు. విత్తనాలు నాటడానికి అవసరమైన శ్రమను, సమయాన్ని తగ్గిస్తాయి. ఇది రైతులకు మెరుగైన సామర్థ్యం, మెరుగైన పంట దిగుబడి, తగ్గిన ఖర్చులు, మెరుగైన ఖచ్చితత్వం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. ఎరువులు, పురుగు మందులు వేసేటప్పుడు వాటిని తాకడంవల్ల వచ్చే ఆరోగ్యసమస్యలు, పురుగుల లేదా పాముకాటు వంటి అనేక సమస్యల నుంచి కాపాడుతాయి. హరిత సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలతో పాటుగా ఇబ్బందుల నివారణలో రైతులకు సహాయపడతాయి. పంట పొలాల వైమానిక చిత్రాలు వీడియోలను రూపొందించడానికి, వాటిని మార్కెటింగ్ ప్రమోషన్ ప్రయోజనాలను పొందవచ్చు. పొలాల నుంచి కూరగాయలు, పండ్లు, మొదలైన వాటిని మార్కెట్లకు తీసుకెళ్లడానికి కూడా వీటిని ఉపయోగించవచ్చు. తక్కువ నష్టంతో, తక్కువ సమయం వెచ్చించి నేరుగా వీటి ద్వారా మార్కెట్‌కు సరఫరా చేయడం వల్ల రైతులకు నష్టాలను తగ్గించి లాభాలను పెంచుతాయి.వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించడానికి పుష్కలమైన అవకాశాలను కూడా అందిస్తుంది.

వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగల డ్రోన్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షకులు అవసరం కాబట్టి ఇవి గ్రామీణ ప్రాంతంలో యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. డ్రోన్ పరిశ్రమకు మద్దతు, పరిష్కారాలను అందించగల డేటా విశ్లేషకులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, హార్డ్‌వేర్ తయారీదారులు వంటి పరోక్ష ఉపాధి అవకాశాలను కూడా డ్రోన్‌లు సృష్టించగలవు. మనదేశంలో డ్రోన్ పరిశ్రమ 2030 నాటికి తయారీ సామర్థ్యానికి 5,00,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.

డ్రోన్ సాంకేతికతను స్వీకరించడానికి ఆటంకం కలిగించే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డ్రోన్ల వాడకం వల్ల మానవ శ్రమ అవసరం తగ్గుతుందని, తమ జీవనోపాధి దెబ్బతింటుందని చాలా మంది కూలీలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జనాభాలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయంలో డ్రోన్లను ప్రవేశపెట్టడానికి ఇది ఒక అవరోధంగా మారవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి మరిన్ని ప్రయత్నాలు, చొరవలు అవసరం. డ్రోన్‌లను నిర్వహించడానికి శిక్షణ, నైపుణ్యం అందించాలి. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగానికి అనుకూలమైన ఎనేబుల్ చేసే పర్యావరణ వ్యవస్థను రూపొందించడం అవసరం. డ్రోన్లు భారతీయ వ్యవసాయాన్ని మార్చడానికి, దేశ ఆహార భద్రత శ్రేయస్సును నిర్ధారించడానికి శక్తివంతమైన సాధనం. అయితే వీటిని ఉపయోగించడంలో కొన్ని సందేహాలను, రైతుల భయాలను పోగొట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

దిల్లీలో ఈడీ అధికారులపై దాడి

న్యూదిల్లీ: సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై కొందరు గుర్తుతెలియని దుండగులు దాడులకు దిగారు. ఈ ఘటన దిల్లీలోని బిజ్వాసన్ అనే ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. ఈ మేరకు ఈడీ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈడీలోని హై-ఇంటెన్సిటీ యూనిట్ అధికారులు దేశవ్యాప్తంగా సైబర్‌క్రైమ్ నెట్‌వర్క్‌తో ముడిపడి ఉన్న ఛార్టెడ్ అకౌంటెంట్లు లక్ష్యంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీలో బిజ్వాసన్ ప్రాంతంలోని ఓ ఫామ్ హౌస్‌లో సోదాలు నిర్వహిస్తుండగా... ఐదుగురు దుండగులు ఫర్నీచర్‌తో అధికారులపై భౌతిక దాడికి దిగారు. ఈ ఘటనలో ఈడీ అదనపు డైరెక్టర్‌కు గాయాలయ్యాయి. దుండగులు ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్యూఆర్ కోడ్, ఫిషింగ్, పార్ట్‌టైమ్ జాబ్స్ వంటి స్కామ్‌లు సహా వేలాది సైబర్‌క్రైమ్‌ల నుంచి వచ్చిన అక్రమ నిధులను వెలికితీసేందుకు ఈ సోదాలు నిర్వహిస్తునట్లు ఈడీ అధికారులు తెలిపారు.

దిల్లీలో బాంబు పేలుడు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో మరోసారి బాంబు పేలుడు కలకలం సృష్టిస్తోంది. రోహిణి ప్రాంతంలోని ప్రశాంత్ విహార్‌లో గల పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో గురువారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. దీంతో స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారమందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఓ ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టారు. పేలుడు జరిగిన ప్రాంతంలో తెలుపు రంగు పొడిని గుర్తించారు. తక్కువ తీవ్రత కలిగిన బాంబు పేలి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సరిగ్గా నెలరోజుల క్రితం ఇదే ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ పాఠశాల ఎదుట పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. తాజా పేలుడు కూడా అచ్చం నాటి ఘటన లాగే ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ప్రస్తుతానికి ఈ రెండింటికీ సంబంధం ఉందనే నిర్ధయానికి రాలేమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

మోదీతో జై శంకర్ భేటీ

న్యూదిల్లీ: బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరిచారనే ఆరోపణలపై ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయ్ కృష్ణదాస్ ప్రభును ఢాకా విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేయడం, అక్కడి హిందువులపై జరుగుతున్న దాడులు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపడంతో ప్రధాని మోదీని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ గురువారం కలిశారు. పొరుగుదేశంలోని పరిస్థితులపై ఇద్దరు నేతలు చర్చించారు. మరోవైపు బంగ్లాదేశ్‌తో పాటు పొరుగుదేశాలతో భారత్ సంబంధాలపై శుక్రవారం జైశంకర్ పార్లమెంట్‌లో వివరించనున్నారు. చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు అక్కడి న్యాయస్థానం నిరాకరించింది. దీంతో కొన్ని సంఘాలు అక్కడ ఆందోళనలకు దిగాయి. ఈ క్రమంలో ఓ న్యాయవాది సైతం ప్రాణాలు కోల్పోయారు. దీంతో అక్కడ ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. దీన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ ఖండించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. మరోవైపు బంగ్లాదేశ్‌లోని ఉద్రిక్తతలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. 'ఏ మతానికి హాని కలగకూడదు. ఇస్కాన్ నిర్వాహకులతో మాట్లాడాను. ఇతర దేశాల్లో జరుగుతున్న దాడులపై రాష్ట్ర ప్రభుత్వాలు కలగజేసుకోవు. కేంద్రమే దీనిపై స్పందించాలి' అని ఆమె పేర్కొన్నారు.

ఉగ్రవాది సల్మాన్ అరెస్టు

న్యూదిల్లీ: పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది సల్మాన్ రెహమాన్ ఖాన్ ఎట్టకేలకు చిక్కాడు. ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగించేలా సల్మాన్ రెహమాన్ ఖాన్ తూర్పు ఆఫ్రికా దేశం రువాండా రాజధాని కిగాలీ నుంచి బెంగళూరులో ఉన్న తన సహచరులకు డబ్బు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి పంపాడు. దీనిపై సమాచారం అందుకున్న కేంద్ర నిఘా సంస్థలు బెంగళూరులో తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున మారణాయుధాలు లభ్యమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఎన్ఐఏ సల్మాన్ రెహమాన్ ఖాన్ ఆచూకీ కోసం అత్యంత రహస్యంగా విచారణ చేపట్టింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఎన్ఐఏ, ఇంటర్‌పోల్, నేషనల్ సెంట్రల్ బ్యూరో నిర్వహించిన సీక్రెట్ ఆపరేషన్‌లో కిగాలీలో సల్మాన్ రెహమాన్ ఖాన్ దొరికాడు.

మంత్రి పదవుల్లో సగం బీజేపీకే!

షిండే పార్టీకి 12... పవార్‌కు 9

ముంబై: మహారాష్ట్రలో మహాయుతి కూటమి ప్రభుత్వం ఏర్పాటుపై నెలకొన్న ప్రతిష్టంభన కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి పదవి బీజేపీకి దక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా కేబినెట్ కూర్పుపైనా కూటమిలో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. మంత్రిమండలిలో సగం పదవులు బీజేపీ వద్దే ఉంచుకోనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆర్థికశాఖ బీజేపీకే లభించే అవకాశాలు కనిపిస్తోంది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు మూడు కీలక శాఖలతో పాటు 12 పదవులు దక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహారాష్ట్ర మంత్రిమండలిలో గరిష్ఠంగా 43 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఇందులో 20కి పైగా పదవులను బీజేపీ తీసుకునేందుకు కూటమి నేతల మధ్య అంగీకారం కుదిరినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. శివసేనకు 13, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 9 కేబినెట్ పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. షిండే వర్గానికి పట్టణాభివృద్ధి, ప్రజా పనుల అభివృద్ధి, జల వనరుల శాఖలు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు మహాయుతి నేతలు షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ గురువారం దిల్లీలో బీజేపీ పెద్దలను కలిశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ముగ్గురు నేతలు సమావేశమయ్యారు. కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ వైపే మొగ్గే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈనెల 30న గానీ, వచ్చే నెల 1న గానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరే అవకాశముంది. ఈసారి కూడా ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను నియమించనున్నట్లు తెలుస్తోంది.

షిండే దిల్లీ ప్రదక్షిణలు: సంజయ్‌రౌత్

మరోవైపు, మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమవుతుండటంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శలు గుప్పించారు. 'వారికి పూర్తి మెజార్టీ వచ్చినా ఇంకా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేకపోతున్నారు. ఫలితాలు వచ్చి ఏడు రోజులైనా సీఎం ఎవరనేది చెప్పట్లేదు. తమ ముఖ్యమంత్రి ఎవరనేది ప్రధాని, అమిత్ షా, వారి నేతలు ఎందుకు నిర్ణయించుకోలేకపోతున్నారు. శివసేన పేరు పెట్టుకొని ఏక్‌నాథ్ షిండే రాజకీయాలు చేశారు. కానీ, ఇప్పుడు సొంత నిర్ణయాలు తీసుకోలేక దిల్లీ వెళ్లారు. మా హయాంలో బాల్ ఠాక్రే భవిష్యత్తును ఎన్నడూ దిల్లీలో నిర్ణయించలేదు. ముంబైలోనే ఉన్నాం. కానీ, ఇప్పుడు వారు దిల్లీ వెళ్లి పదవుల కోసం ప్రాధేయపడుతున్నారు' అని రౌత్ ఎద్దేవా చేశారు.

ఏఎఫ్ఎస్పీ వద్దే వద్దు ... మణిపూర్‌లో భారీ ర్యాలీ

ఇంఫాల్: సాయుధ దళల (ప్రత్యేక అధికారాల) చట్టం (ఏఎఫ్ఎస్పీ) రద్దుకు డిమాండ్ చేస్తూ మణిపూర్‌లోని ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో గురువారం భారీ ర్యాలీ జరిగింది. కర్ఫ్యూను సైతం లెక్క చేయకుండా వేలాది మంది కదం తొక్కారు. వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. జిరిబమ్ జిల్లాలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లల హత్యకు కారణమైన ఏఎఫ్ఎస్పీ రద్దునకు డిమాండ్ చేశారు. లంలై నియోజకవర్గంలోని నోంగడ నుంచి యోర్బుంగ్ వైపు 4.5కిమీల మేర ఈ ర్యాలీ సాగింది. లంలైలోని స్థానిక క్లబ్‌లు, మేరా పైబిస్ అధ్వర్యంలో వేలాది మందితో ప్రదర్శన జరిగింది. అణచివేతకు అస్త్రంగా ఏఎఫ్ఎస్పీ ఉన్నదని నిరసనకారులు నినదించారు. దీనిని ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తున్నట&ఊఉల తెలిపారు. మణిపూర్, ఇంఫాల్ లోయ ప్రజల వెతలు ప్రభుత్వానికి పట్టడంలేదని నిరసనలో పాల్గొన్న వై లేమా అనే మహిళ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిరిబమ్ జిల్లాలో కోఆర్డినేటింగ్ కమిటీ ఆఫ్ మణిపూర్ ఇంటిగ్రిటి (సీఓసీఓఎంఐ) విద్యార్థి విభాగానికి చెందిన వలంటీర్లు స్థానిక ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించారు. ఉద్యోగులను బయటకు పంపి కార్యాలయాలకు వాటికి తాళం వేసి నిరసన తెలిపారు. కుకీ-జో తీవ్రవాదులపై చర్యలు, ఏఎఫ్ఎస్పీఏ రద్దునకు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో హింస దృష్ట్యా ఏఎఫ్ఎస్పీఏను కేంద్రం ఇటీవల పునరుద్ధరించిన విషయం విదితమే.

ఓడితేనే ఈవీఎంలపై కాంగ్రెస్ ఏడుపు: బీజేపీ

న్యూదిల్లీ: హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)లో లోపాలపై కాంగ్రెస్ ఫిర్యాదులు చేయడాన్ని బీజేపీ విమర్శించింది. 'ఓడిపోతేనే ఈవీఎంలలో లోపాలు ఉన్నట్లు... హ్యాకింగ్ జరిగినట్లు గోల చేస్తారు. అదే వారు గెలిస్తే... ఇది కాంగ్రెస్ గెలుపంటూ చంకలు గుద్దుకుంటారు' అని ఎక్స్‌లో బీజేపీ ఎద్దేవా చేశారు. లోపం ఉన్నది ఈవీఎంలలో కాదు కాంగ్రెస్ ఆలోచనలు, దాని ఉద్దేశాల్లో అని విమర్శించింది. 'హర్యానా, మహారాష్ట్రలో ఈవీఎంల కారణంగా ఓడిపోయారు... అదే వయనాడ్‌లో రాహుల్, ప్రియాంక వల్లే గెలిచారు' అంటూ వయనాడ్‌లో సోదరి గెలుపును రాహుల్ సంబరం చేసుకుంటున్న ఫొటోతో పాటు బీజేపీ వ్యంగ్యంగా పోస్టు పెట్టింది. 'ఈవీఎంలను వాళ్లను వాళ్లవద్దనే ఉంచుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. బ్యాలెట్ పేపర్లు కావాలి. అప్పుడే వారికి వారి స్థానం తెలుస్తుంది. బ్యాలెట్ పేపర్ల కోసం భారత్ జోడో యాత్ర తరహా ప్రచారాన్ని మనం మొదలు పెట్టాలి' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొనడం విదితమే.

రాత్రి 7 దాటితే మహిళల్లో భయం

శాంతి భద్రతల క్షీణత బాధ్యత బీజేపీదే: దిల్లీ సీఎం ఆతిశీ

న్యూదిల్లీ: దేశ రాజధాని మహిళలకు సురక్షిత ప్రాంతంగా లేదని ముఖ్యమంత్రి ఆతిశీ ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 7 దాటినదంటే యువతులు, మహిళలు భయపడిపోతున్నారన్నారు. తమ కుమార్తెలు బయటకు వెళ్లారంటే తల్లిదండ్రులు భయం భయంగా గడుపుతున్నారని చెప్పారు. దిల్లీలో శాంతి భద్రతలు క్షీణించడానికి బీజేపీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాదే బాధ్యతని ఆతిశీ దుయ్యబట్టారు. రోహిణిలోని పీవీఆర్ ప్రశాంత్ విహార్ సమీపంలో పేలుడు జరిగిన అనంతరం ముఖ్యమంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు కాపాడటంతో కేంద్రప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. పేలుడును తీవ్రంగా ఖండించారు. రెండు నెలల్లో ఇదే ప్రాంతంలో ఇది రెండవ ఘటన అంటూ ఆందోళన వ్యక్తంచేశారు. లా ఎన్‌ఫోర్స్‌మెంట్, భద్రతా చర్యల్లో లోపాలు ఉన్నట్లు ఈ ఘటనలతో స్పష్టమైందన్నారు. దిల్లీ ప్రజల భద్రతను అమిత్‌షా నిర్లక్ష్యం చేస్తున్నారని సీఎం విమర్శించారు. ఇలాంటి భయోత్పాత వాతావరణం దిల్లీలో నెలకొనడానికి అమిత్‌షానే బాధ్యులని, హోంమంత్రి నివాసముండే ప్రాంతానికి చేరువలో దోపిడీలు జరుగుతున్నట్లు చాలా ఫిర్యాదులు వచ్చాయని ఆతిశీ చెప్పారు.

దిల్లీ వాసుల్లో పెరుగుతున్న అభద్రత: కేజ్రీవాల్

దిల్లీ వాసుల్లో అభద్రతా భావం రోజురోజుకు పెరిగిపోతోందని, ఇందుకు కారణం కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరేనని మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఆయన వేరుగా విలేకరులతో సమావేశమై కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దిల్లీలో క్షీణించిన శాంతి భద్రతల గురించి మాట్లాడారు. నగర వాసుల్లో అభద్రతా భావన, భయం పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. 'దిల్లీవ్యాప్తంగా భయం రాజ్యమేలుతోంది. రాత్రి 7 దాటితే మహిళలు భయంతో వణికే పరిస్థితి నెలకొంది. పిల్లలు గడప దాటాల్సి వస్తే తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. భద్రతా ప్రమాణాలు, చర్యల్లో మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని ఈ సందర్భంగా ఆయన కేంద్రానికి హితవు పలికారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీకి బీజేపీకి మధ్య శాంతి భద్రతలకు సంబంధించిన వివాదం మరింత ముదిరింది. ఇది రాజకీయపరమైన ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తోంది.

ప్రభుత్వ మొండివైఖరి వల్లే వాయిదాల పర్వం

జైరామ్ రమేశ్

న్యూదిల్లీ: ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలో స్వేచ్ఛ, పారదర్శక పోటీని నాశనం చేస్తున్న అదానీ ముడుపుల కుంభకోణం అంశాన్ని లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించకుండా ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తున్నందునే పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోందని కాంగ్రెస్ గురువారం తెలిపింది. సంభాల్ హింసాకాండ, అదానీ సమస్యపై విపక్షాల నిరసనల మధ్య లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఇక అదానీ, మణిపూర్, యూపీలోని సంభాల్‌లో జరిగిన హింసాకాండపై ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభ కూడా వరుసగా మూడో రోజు ఎటువంటి కార్యకలాపాలు లేకుండా వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'ప్రభుత్వం అనేక రంగాలలో స్వేచ్ఛ, న్యాయమైన పోటీని నాశనం చేస్తున్న మోదానీ స్కామ్ అంశాన్ని లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించడానికి ప్రభుత్వం నిరాకరించినందున ఈ రోజు కూడా పార్లమెంటు ఉభయ సభలు వాయిదా పడ్డాయి' అన్నారు. అదానీ ముడుపుల వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా భారత్ విశ్వసనీయత, ఖ్యాతిని నాశనం చేస్తోందన్నారు. అదానీ గ్రూప్ అక్రమాలు, సంభాల్‌లో హింసపై చర్చలు జరపాలని ఇండియా కూటమి పక్షాలు ఒత్తిడి చేస్తున్నాయి.

జార్ఖండ్ విజయంతో 'ఇండియా' బలోపేతం: అఖిలేశ్

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఇండియా ఐక్యసంఘటనకు బలోపేతానికి దోహదం చేసిందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు యాదవ్ గురువారం మధ్యాహ్నం రాంచీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా బిర్సా ముండా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... 'జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చాయి... ప్రజలు మంచి అవగాహనతో ప్రజాస్వామ్య నిర్ణయాలతో ప్రగతిశీల ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. జార్ఖండ్ అభివృద్ధి, పురోగతి పథంలోకి తీసుకురావడానికి వారు హేమంత్ సోరెన్, ఇండియా కూటమికి మరో అవకాశం ఇచ్చారన్నారు. 'రాబోయే రోజుల్లో ఇండియా కూటమి మరింత బలంగా ఉంటుంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, గిరిజనులు, రైతుల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని అన్నారు. బీజేపీపై విమర్శలు ఎక్కుపెడుతూ... కాషాయ పార్టీకి కోర్టులు, రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలపై విశ్వాసం లేదని మండిపడ్డారు. ఆ పార్టీ రాజ్యాంగ సంస్థలను వక్రీకరించడం ద్వారా వారికి విధేయులైన వారికి ప్రయోజనం చేకూర్చడానికి , వారి ప్రయోజనాలకు సేవ చేయడానికి పని చేస్తుందని కేంద్రంలోని మోదీ సర్కార్‌పై అఖిలేశ్ విమర్శలు చేశారు.

కాంగ్రెస్ అతి విశ్వాసంతోనే ఓటమి

మిత్రపక్షం శివసేన ఆరోపణ

ముంబై: మహారాష్ట్రలో కాంగ్రెస్ అతి విశ్వాసమే అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమి ఓటమి కి కారణమని మిత్రపక్షం శివసేన ఆరోపించింది. ఎంవీయేలో సీట్ల పంపకాల విషయంలో కాంగ్రెస్ ప్రదర్శించిన వైఖరి... కూటమి విజయావకాశాలను దెబ్బతిశాయని సంచలన వ్యాఖ్యలు చేసింది. శివసేన(యూబీటీ) సీనియర్ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నేత అంబాదాస్ దాన్వే మాట్లాడుతూ ఉద్ధవ్ ఠాక్రేను ముఖ్యమంత్రి అభ్యర్థిగా పేర్కొంటూ మహా వికాస్ అఘాడి ఎన్నికలకు వెళ్లాల్సిందని అన్నారు. 'లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత హర్యానా, జమ్మూ కశ్మీర్‌లో మాదిరిగానే మహారాష్ట్రలోనూ కాంగ్రెస్‌కు మితిమీరిన ఆత్మవిశ్వాసం ఉంది. ఇదే ఫలితాల్లో ప్రతిబింబించింది. సీట్ల పంపకాల చర్చల సమయంలో కాంగ్రెస్ వైఖరి మమ్మల్ని బాధించింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉద్ధవ్‌ను ప్రకటించాల్సి ఉండేది. అలా చేయకపోవడం మా అవకాశాలను దెబ్బతీసింది. అలా చేసి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవి' అని దాన్వే పేర్కొన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రకు సంబంధించిన 48 స్థానాల్లో మహా వికాస్ అఘాడి అత్యధికంగా 30 చోట్ల గెలుపొందింది. మిత్రపక్షాలతో పోలిస్తే కాంగ్రెస్ ఎక్కువగా 13 స్థానాల్లో విజయం సాధించింది. ఇదే జోష్ మీదున్న కాంగ్రెస్... రాష్ట్ర ఎన్నికలకు ముందు సీట్ల భాగస్వామ్య చర్చల సమయంలో గట్టిగా బేరసారాలు చేసింది. ఇది కూటమిలో ఘర్షణకు దారితీసింది. చివరకు 103 స్థానాల్లో పోటీ చేసినా కేవలం 16 మాత్రమే గెలుపొందింది. 89 స్థానాల్లో పోటీ చేసిన సేన (యూబీటీ) 20 స్థానాల్లో విజయం సాధించింది. మూడో మిత్రపక్షమైన శరద్ పవార్ ఎన్సీపీ 87 స్థానాల్లో పోటీ చేసి 10 స్థానాల్లో విజయం సాధించింది.

హాసన్‌లో సిద్ధరామయ్య సంబరాల సభ

బెంగళూరు: ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనేలా సీఎం సిద్ధరామయ్య వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. 'ముడా' కేసులో తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టడంతోపాటు ఉపఎన్నికల్లో జేడీఎస్ పార్టీ ఓటమితో కంగుతిన్న తరుణంలోనే బలప్రదర్శనకు సిద్ధమయ్యారు. మూడు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో చన్నపట్టణలో జేడీఎస్ నేత నిఖిల్ ఓటమి అధికార కాంగ్రెస్‌కు ఎనలేని సంతోషాన్ని కలిగించింది. చన్నపట్టణ ఎన్నిక మాజీ ప్రధాని దేవెగౌడ, సీఎం సిద్ధరామయ్య మధ్య సమరంలా సాగింది. సిద్ధరామయ్య ప్రభుత్వం కూలేంతవరకు విశ్రమించేది లేదని దేవెగౌడ శపథం బూని ప్రచారం చేశారు. ఎన్నికల్లో సిద్ధరామయ్య కూడా ధీటుగానే పర్యటించి సవాళ్లు విసిరారు. దేవెగౌడ ఒక్కలిగలలో ఒకరిని కూడా ఎదగనివ్వలేదన్నారు. తాను బీసీ అనే కారణంతో వ్యతిరేకిస్తారన్నారు. కానీ వైకే రామయ్య, నాగేగౌడ, బచ్చేగౌడ, వరదేగౌడ, పుట్టణ్ణ, చలువరాయస్వామి, బాలకృష్ణ, బైరేగౌడ, కేఆర్ పేట చంద్రశేఖర్ వంటి ఎంతోమందిని ఎదగనివ్వకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. డీకే శివకుమార్, డీకే సురేశ్‌లను ముగించాలని కంకణం కట్టుకున్నారన్నారు. కొడుకులాంటివారని చెప్పుకొంటూనే బీఎల్ శంకర్, వైకే రామయ్యలను ముగించారని ప్రచారం చేశారన్నారు. ఉప ఎన్నికల ఫలితాలతో జేడీఎస్ పార్టీకి రామనగరలో ఉనికి లేకుండా పోయింది. హాసన్‌లోనూ ఎంపీ సీటు కోల్పోవడంతో భారీ దెబ్బ పడింది. ఇటువంటి తరుణంలోనే దేవెగౌడ కంచుకోటగా ఉండే హాసన్‌లో భారీ సమావేశం నిర్వహించేందుకు సీఎం సిద్ధరామయ్య కసరత్తు చేస్తున్నారు. మాండ్య, మైసూరు నుంచే కనీసం 2 లక్షలమందిని సమీకరించే ఆలోచనలో ఉన్నారు. భారీ సమావేశం ద్వారా సిద్ధరామయ్య తన ప్రతిష్ఠను పెంచుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయనకు ఆప్తులుగా ముద్రపడిన మంత్రులు మహదేవప్ప, రాజణ్ణలను రంగంలోకి దింపారు.

అన్నాచెల్లెళ్ల సరదా

ఫొటోకు పోజిచ్చిన ప్రియాంక

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ లోక్‌సభ ఎంపీగా గురువారం నుంచి సరికొత్త ప్రయాణం ప్రారంభించారు. వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికలో విజయం సాధించిన ఆమె... ఈ రోజు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో ఒక ఆత్మీయ సన్నివేశం చోటుచేసుకుంది. దానికి సంబంధించిన దృశ్యాలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రమాణ స్వీకారంలో భాగంగా ప్రియాంక పార్లమెంట్‌లోకి వస్తుండగా... స్టాప్ అంటూ రాహుల్ ఆమెను ఆపేశారు. ఫొటోకు ఒక పోజు ఇవ్వమని చెప్పగా ఆమె చిరునవ్వులు చిందించారు. తర్వాత ఇతరులతో కలిసి పోజివ్వగా రాహుల్ ఫొటో క్లిక్‌మనిపించారు. నెహ్రూ-గాంధీ వారసులు సందర్భం వచ్చినప్పుడల్లా ఒకరిపై మరొకరికున్న ఆప్యాయతను బయటకు వ్యక్తం చేస్తుంటారు. వయనాడ్‌లో చెల్లెలి విజయం కోసం రాహుల్ ప్రచారం చేయగా... గెలుపు అనంతరం అన్న గురించి ప్రియాంక గొప్పగా చెప్పారు. 'రాహుల్... నువ్వు అందరికంటే ధైర్యవంతుడివి. నాకు దారిచూపి, నా వెన్నంటి నిలిచినందుకు థాంక్యూ' అని ప్రకటించారు.

ప్రియాంక రాకతో ఇప్పుడు ఒకేసారి ముగ్గురు నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులు పార్లమెంటు ఎంపీలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన ప్రియాంక గాంధీ... తొలి అడుగులోనే భారీ విజయం నమోదు చేశారు.

ఈ ఉప ఎన్నికలో తన సమీప ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు. ఎంపీ హోదాలో మొదటిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు.

మానవుల అక్రమ రవాణా కేసులో ఆరు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

న్యూదిల్లీ: మానవుల అక్రమ రవాణా వలయాన్ని ఛేదించేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగింది. ఏకకాలంలో ఆరు రాష్ట్రాల్లో 22 చోట్ల వేర్వేరు బృందాలతో సోదాలు చేపట్టింది. అనుమానిత వ్యక్తులు, సంస్థల ఆస్తులను స్థానిక పోలీసు బృందాలతో కలిసి తనిఖీ చేసింది. వ్యవస్థీకృత ట్రాఫికింగ్ నెట్‌వర్క్ నిర్వీర్యమే లక్ష్యంగా ఎన్ఐఏ సోదాలు జరిగాయి. తమకున్న సమాచారం ఆధారంగా తనిఖీలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పురుషులు, మహిళలు, పిల్లలను దేశ, విదేశాలకు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యవహారాన్ని ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. మానవుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు విస్తృత చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే అనేక మంది ట్రాఫికర్ల సరఫరా గొలుసులను ఛేదిస్తూ ఎందరో బాధితులను కాపాడింది. తాజా తనిఖీల్లో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా సిండికేట్ గుట్టు రట్టు అయింది. మైన్మార్, లావోస్‌తో సహా అనేక దేశాలతో సంబంధాలు బయటపట్టాయి. విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి ముఖ్యంగా బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా యువతను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిసింది. విదేశాలకు తరలించిన తర్వాత వారిలో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు వెల్లడైంది.

జార్ఖండ్‌లో ఘోరం

ప్రేయసిని చంపి... 50 ముక్కలు చేసిన ప్రియుడు

రాంచీ: జార్ఖండ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడు తనతో సహజీవనం చేస్తున్న యువతిని అతి కిరాతంగా హతమార్చాడు. అంతటితో ఆగకుండా మృతురాలి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికాడు. ఖుంటి జిల్లాలోని జరియాగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వారాల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్‌లోని జోర్దాగ్ గ్రామానికి చెందిన 25 ఏళ్ల నరేశ్ బెంగ్రా అనే యువకుడు గంగి కుమారి(24) అనే యువతితో రెండేళ్లుగా సహ జీవనంలో ఉన్నారు. వీరిద్దరూ తమిళనాడులో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. నరేశ్ బెంగ్రా తన ప్రియురాలు గంగి కుమారికి తెలియకుండా ఖుంటిలో మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఏమీ తెలియనట్లు మళ్లీ తమిళనాడు వచ్చి గంగితో కలిసి జీవించేవాడు. ఇటీవల ఈ విషయం ప్రియురాలికి తెలియడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో నవంబర్ 9న ఇద్దరు జార్ఖండ్‌లోని ఖుంటికి తిరిగి వచ్చారు.

యువతిని తన ఇంటికి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. అనంతరం శరీరాన్ని 50 ముక్కలుగా నరికి అడవిలోనే విసిరేశాడు. నవంబరు 24న యువతి శరీరంలోని ఓ భాగాన్ని కుక్క తింటూ కనిపించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అది గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా... అటవీ ప్రాంతం నుంచి మరికొన్ని శరీర భాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడవిలో గంగి వస్తువులు, ఆమె ఆధార్ కార్డు, ఫోటో సహా ఆమె బ్యాగ్‌ని పోలీసులు గుర్తించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు నరేశ్ బెంగ్రాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బాధితురాలిని హత్య చేసి, ఆమె మృతదేహాన్ని నరికివేసినట్లు అతను అంగీకరించాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

మెట్రో రైలు శివారు ప్రాంతాలకు విస్తరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నగర శివారు ప్రాంతాలకు మెట్రో రైలు విస్తరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మెట్రో రైల్ ఎండి ఎన్ వి ఎస్ రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. దశాబ్ద కాలంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో కూడా జనాభా భారీగా పెరిగింది. ఇక్కడి ప్రజలు నిత్యం ఉద్యోగరీత్యా హైదరాబాద్ లోని పలు ప్రాంతాలకు ప్రయాణించడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని, ఈ సమస్యను పరిష్కరించాలంటే రెండవ దశ మెట్రో రైల్ కనెక్టివిటీ నిర్మాణంలో భాగంగా జే.బి.ఎస్.నుండి మేడ్చల్ (20కి.మీ), పారడైజ్ నుండి కండ్లకోయ (22 కి.మీ), తార్నాక నుండి కీసర (20 కి.మీ), బోయింపల్లి నుండి గండి మైసమ్మ (21కి.మీ), జె.బి.ఎస్ నుండి శామీర్ పేట్ (22 కి.మీ) మేరకు రెండవ దశలో మెట్రో రైల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని, తద్వారా హైదరాబాద్ నగరమంతా సమతుల్యంగా అభివృద్ధి చెందడమే కాకుండా ప్రజల ఎదుర్కుంటున్న ట్రాఫిక్ సమస్యలు కూడా శాశ్వతంగా తీరుతాయని ఎన్.వి.ఎస్ రెడ్డికి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మెట్రో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో విద్యుత్ వైర్ల తొలగింపునకు 2.11 కోట్లు మంజూరు

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పూర్వపు పంచాయతీ సమితి పరిధిలోని నాలుగు మండలాలలో రైతుల పంట పొలాల నుండి వెళ్లిన ఐటెన్షన్ విద్యుత్ వైర్లు తొలగింపులకు 2.11 కోట్ల రూపాయలు ప్రభుత్వ మంజూరు చేసినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. గురువారం ఆమనగల్లులో మాట్లాడుతూ ఈ నిధులతో రైతుల పంట పొలాల నుండి వెళ్తూ ఇబ్బందిగా మారిన విద్యుత్ వైర్లను తొలగించినట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల్, కడ్తాల్ మండలాల రైతుల కోసం సబ్సిడీపై 1000 యూనిట్ల స్పింకులర్ లు మంజూరి అయ్యాయని అవసరం ఉన్న రైతులు 7500 రూపాయలు డీడీలు చెల్లించి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 28 29 30 తేదీలలో మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో రైతు పండుగను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అందులో భాగంగా రైతు సదస్సులు నిర్వహించి ఆధునిక పద్ధతులు, యాంత్రికరణ పై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 30న సీఎం పాల్గొనే బహిరంగ సభకు ఈ ప్రాంతం నుండి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు కిషన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యాట నరసింహ, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్, బిచ్చ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - కూకట్పల్లి: జ్యోతిరావు పూలేను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజదేవి రంగారావు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని రిక్షా పుల్లర్స్ కాలనీలో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసంస్కర్త, దిగువ కులాల సమాన హక్కులకు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. మహిళా విద్య కోసం పోరాడిన వ్యక్తి అని, భారతదేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన జ్యోతిరావు పూలే దంపతులు అని అన్నారు. నేటితరం జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, మధు, మల్లేష్, కృష్ణ, యశ్వంత్, జగదీష్ గౌడ్, ప్రవీణ్, విక్రమ్, కిరణ్, విద్యాసాగర్, రవీంద్రరావు, బాబు, రవి, శ్రీనివాస్, బద్రి, లడ్డు, మాధవి రెడ్డి పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అజయ్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర - బషీర్ బాగ్: పేదల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం కురుమూర్తి స్వామివారిని గురువారం బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ కుటుంబ సమేతంగా యాదవ సంఘం నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం డైరెక్టర్లు సాయిలు యాదవ్, రాజగోపాల్ యాదవ్, బీర్ల ఎల్లయ్య యాదవ్, గోవింద్ యాదవ్, బీసీ ఉద్యోగ సంఘాల నాయకుడు రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని భాషల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలో భారతరత్న భీమ్ రావు అంబేద్కర్ గ్రంథాలయ ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సామాన్య జనానికి అన్ని భాషల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. విద్యార్థులు గ్రంథాలయాలు పుస్తకాలను చదవడం వల్ల పోటీ తత్వాన్ని అధిగమించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుంగ తిరుపతి, నక్క నాగేశ్వరరావు, చిలుక శంకర్, దేశపతి బిక్షపతి, బొమ్మిడి శెట్టి కనకారావు, బొమ్మిడి శేటి నర్సింగ్‌రావు, చిల్లాపురం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం,రైతుకు ఏ చిన్న కష్టం కూడా రానీయమని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామంలో కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి మంచి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతాంగానికి ఇచ్చిన హామీలను త్వరలోనే పూర్తిగా నెరవేరుస్తారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారని అన్నారు. సన్నధాన్యానికి 500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది నుండి పంటల భీమా సైతం అమలు చేయబోతున్నామని అన్నారు. ఈనెల 30న పాలమూరులో నిర్వహిస్తున్న రైతు పండుగను పురస్కరించుకొని రుణమాఫీ రాని రైతులు అందరికీ రెండు లక్షల లోపు బకాయిలు ఉన్న వారికి రుణమాఫీ దాదాపు మూడు కోట్ల 3 వేల కోట్ల వరకు చెల్లిస్తామని అన్నారు. వచ్చే సంక్రాంతి నుండి తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వం రైతు భరోసా వేసే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈనెల 30న పాలమూరులో జరిగే రైతు సదస్సుకు 40 రైతులకు రుణమాఫీ జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. వచ్చే ఏడాది నుండి పంటల భీమా కూడా వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు చిట్టెం దామోదర్ రెడ్డి గోవర్ధన్ గౌడ్ పురుషోత్తం రెడ్డి జితేందర్ రెడ్డి అంజిరెడ్డి మల్లేష్ గౌడ్, మల్లేష్ శ్రీనివాస్, రాజు ఆంజనేయులు ముబారక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పూలే త్యాగాలను, సమాజంలో సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ ప్రసంగించారు. పూలే ప్రజల హక్కుల కోసం, ముఖ్యంగా మహిళల విద్య, అన్యాయాల పరిష్కారం, మరియు సామాజిక సమానత్వం కోసం చేసిన కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ నేతలు, స్థానిక నాయకులు, మరియు మల్కాజిగిరి ప్రజలు హాజరై మహాత్మ పూలే సేవలను స్మరించుకున్నారు.

వాల్యూజోన్ షాపింగ్‌మాల్ ప్రారంభించిన హీరో బాలకృష్ణ

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలో సినీ హీరో బాలకృష్ణ సందడి చేశారు. భారత దేశంలోనే అతిపెద్ద షాపింగ్ మాల్‌గా పేరుగాంచిన హైపర్ మార్ట్కు సినీ హీరో బాలకృష్ణ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో నాచారంలో ఏర్పాటు చేసిన వాల్యూ జోన్ హైపర్ మార్కెట్ ను ఆయన గురువారం ప్రారంభించారు. బాలకృష్ణను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మార్ట్‌లో ఆయన అభిమానులతో సరదగా మాట్లాడారు. అనంతరం వాల్యూ జోన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికంగా విడిపోయిన తెలుగువాళ్లు అంత ఒకటే అన్నారు. అన్నీ దేశాలలో తెలుగువారు రాణిస్తున్నారని చెప్పారు. నాచారంకు తాను లోకల్ అని, తమ స్టూడియోకు బైక్‌పై వచ్చే వాడినని, ఇక్కడ ఏరియా అంతా నాకు తెలుసు అని పేర్కొన్నారు. మనిషి జీవితంలో ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఏం సాధించామన్నదే ప్రాధానమన్నారు. మనం ఇతరులకు చేసిన సేవలే మనల్ని రేపు గొప్ప స్థానంలో నిలబెడతాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మెరిట్ కలిగిన పేద విద్యార్తులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మెడిసిన్‌లో సీటు సంపాదించిన ఎంతో మంది పేద విద్యార్థులకు ఫీజుల రూపేన ఆర్థిక సహాయం అందిస్తున్నారని, ఆయన స్పూర్తితో మరికొంత మంది ముందు రావాలని అన్నారు. తద్వారా పేద విద్యార్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉన్నత చదువులు పూర్తి చేసే అవకాశం కలుగుతుందన్నారు. నాచారంలో ఇండియాలోనే అతిపెద్ద షాపింగ్ మాల్స్ ఒకటైన హైపర్ మార్ట్వాల్యూ జోన్ ఏర్పాటు చేయడం, ఈ షాపింగ్ మాల్ను తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన ప్రతి వస్తువు వాల్యూ జోన్‌లో దొరుకుతుందన్నారు. హీరోబాలకృష్ణ షాపింగ్ మాల్‌ను ప్రారంభంచి తరువాత బయటకు వచ్చే వరకు అభిమానులు ఆయన కోసం బయట వేచి ఉన్నారు. షాపింగ్ మాల్ నుంచి బయటకు వచ్చిన బాలకృష్ణ అభిమానులకు అభివాదం చేస్తూ, వారితో కరచాలనం చేస్తూ వెళ్లి పోయారు.

జ్యోతిరావు పూలేకి నివాళులర్పించిన కార్పొరేటర్

విశాలాంధ్ర- మల్కాజిగిరి : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. ఈ బాల్య వివాహాల రద్దు, అంటరానితల నిర్మూలన తోపాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ఆయన చేసిన కృషి మరువలేనిదని ఆమె పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అధికారులతో గాంధీ సమీక్ష

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో కాలనీలలో చేపట్టిన నాసిరకంతో సిసి రోడ్లను నిర్మించిన విషయమై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ క్వాలిటీ విభాగం అధికారులు ఎస్ఈ అశోక్ రెడ్డి, ఈఈ ఇందిరా బాయ్, శేరిలింగంపల్లి డీఈ వినయ్ దత్, చందానగర్ డీఈ రమేష్‌తో వివేకానంద నగర్‌లోని కార్యాలయంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో పలు కాలనీ లలో చేపట్టిన నాసిరకంతో సిసి రోడ్లను నిర్మించడం చాలా బాధాకరం, నాసిరకం, నాణ్యత ప్రమాణాలు పాటించక రోడ్లు నిర్మించడం, కొత్తగా నిర్మించిన రోడ్లు నాసిరకం పనుల వలన 6 నెలల లోపే దెబ్బతినడం పట్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని, ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

బ్లాక్ లిస్ట్‌లో పెట్టి అట్టి వారికి మళ్ళీ పనులు అప్పగించకూడదని, ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలియచేసారు. అధికారుల పర్యవేక్షణ లోపించడం వలన ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి అని, అధికారులు తీరు మార్చుకోవాలని, మౌలిక వసతులు కల్పించే క్రమంలో అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండలని ఇటువంటి పనులు మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని గాంధీ అధికారులకు తెలియచేసారు. కాంట్రాకర్లు జీహెచ్ఎంసీ యొక్క మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులలో నాణ్యతను నిర్వహించకపోవడాన్ని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ విభాగం అధికారులు ఎస్ఈ అశోక్ రెడ్డి, ఈఈ ఇందిరా బాయ్, శేరిలింగంపల్లి డీఈ వినయ్ దత్, చందానగర్ డీఈ రమేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తిని రగిలించేలా పోరాటం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర సాధన కాలం నాటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలించేలా పోరాటాలు చేస్తామని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పిలుపునిచ్చారు. సమైక్య రాష్ట్ర సంకెళ్లను తెంచి, తల్లి తెలంగాణ విముక్తి కోసం బిఆర్ఎస్ అధినేత, ఉద్యమ నేత కెసిఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను స్మరించుకుంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సూచనల మేరకు శుక్రవారం గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న దీక్షా దివాస్ కార్యక్రమం విజయవంతం చేయుటకై కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జిహెచ్ఎంసిలోని డివిజన్లు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో సన్నాహక సమావేశా కార్యక్రమాలను నిర్వహించారు. దీక్షా దివాస్ కార్యక్రమ సన్నాహక సమావేశంలో భాగంగా గురువారం 130 సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అధ్యక్షతన వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.అనంతరం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనతోనే అభివృద్ధి సాధ్యమని భావించిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ 'తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో' అనే ఉద్యమ పంథాలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు అని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పలు కాలనీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతు అవగాహన స్టాళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగ పేరిట ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29, 30వ తేదీలలో మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు అవగాహన స్టాళ్లను రైతన్నలు సద్వినియోగపరుచుకోవాలని తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రవీందర్ రావు, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తాలు తెలిపారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రవీందర్ రావు, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్లు గంప వెంకటేష్ గుప్తా లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రైతు పండుగ పేరిట రైతన్నల అభివృద్ధి సంక్షేమమే, ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం రైతన్నలకు మంచి అవకాశం దక్కిందన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని లబ్ధి పొందాలని వారు కోరారు. డిసిసిబి డైరెక్టర్లు రంగారెడ్డి, వెంకటయ్య, భీమ్ రెడ్డి, భూపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు అండగా అధికారులు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మండల కేంద్రంలోని ఎంకేపల్లి గ్రామంలో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న గ్రామపంచాయతీ అధికారి ఏమాత్రం వాటిపై చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పదులకు పైగా నిర్మాణాలు జరుగుతున్న పంచాయతీ అధికారి నిర్మాణదారుల దగ్గర నుండి మామూలు వసూలు చేస్తూ వారితో దోస్తానా చేస్తున్నారని గ్రామంలో చిన్న నిర్మాణం చేపట్టిన వాటికి అనుమతులు లేవని ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పంచాయతీ అధికారి చెప్పిందే వేదం అన్నట్టు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గ్రామ చుట్టుపక్కల పెద్ద మొత్తంలో నిర్మాణాలు జరుగుతున్న వాటికి నోటీసులు ఇవ్వడం గానీ 111 జీవో కు విరుద్ధంగా ఎన్నో నిర్మాణాలు జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోవడం పంచాయతీ అధికారి చేయడం లేదని తెలిపారు. ఫామ్ హౌస్‌లో నిర్మాణదశ ప్రారంభవ దశలోనే వాటికి ఇంటి నంబర్లు ఇస్తూ లక్ష కొట్టు ఇంటి నెంబర్ పట్టు అన్న విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు రెవెన్యూ పరిధిలో ఎన్నో నిర్మాణాలకు నిర్మాణ దశ పూర్తకముందే ఇంటి నంబర్లు ఇచ్చారని గ్రామస్తులకు మాత్రం పర్మిషన్లు ఆ పేపర్ తీసుకురా ఈ పేపర్ తీసుకురా అంటూ చెప్పులు అరిగేలా పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేపిస్తున్నారని గ్రామస్తులు గోడు వెల్లబోస్తున్నారు. దీనిపై సెక్రటరీని వివరణ కోరగా నా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాను అడగడానికి మీరెవరు నా పై అధికారుల మద్దతు నాకు ఉంది నేనేం చేసినా అడిగే వారు లేదని దురుసుగా సమాధానం ఇస్తున్నారు. మండల ఎంపీఓను వివరణ కోరగా ఎక్కడ జరగలేనిది అక్కడ మాత్రం జరిగేదేముంది అవును జరుగుతాయని అది నా దృష్టికి కూడా వచ్చింది విచారణ జరిపిస్తానని ఎంపీఓ సమాధానం ఇచ్చారు. డివిజన్ అధికారిని వివరణ కోరగా మీరే ఎంక్వయిరీ చేసి సాక్షాదారాలతో సహా రిపోర్టు నాకు ఇవ్వండి అప్పుడు నేను చర్యలు తీసుకుంటాను అని నిమ్మకు నీరెత్తినట్టుగా సమాధానం చెబుతున్నారు. డిపిఓ డిఎల్పిఓ ఎంపిఓ పంచాయతీ కార్యదర్శి పై ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవలసిన పంచాయతీ అధికారులే చేతులెత్తేసినప్పుడు మేము ఎవరికీ చెప్పుకోవాలని గ్రామస్తులు ఉసురు మంటున్నారు.

పై అధికారులకు సమాచారం అందిస్తే కార్యాలయానికి వచ్చి కాఫీ తాగి కాలక్షేపం చేసి వెళ్తారే తప్ప ఏ ఒక్కరూ పంచాయతీ కార్యదర్శి పై ఎలాంటి చర్యలు తీసుకోరు దీని వెనకాల ఉన్న మర్మమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారిపై అక్రమ నిర్మాణాలపై క్షుణ్ణంగా విచారణ జరిపించి త్రిబుల్ వన్ జీవో కి తూట్లు పొడవకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అణగారిన వర్గాలకు విద్య అందించడంలో పూలే కృషి మరువలేనిది

విశాలాంధ్ర-బషీర్ బాగ్: అనగారిన వర్గాలకు విద్యను అందించడంలో పూలే చేసిన కృషి మరువలేనిది నిజం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా గురువారం నిజాం కళాశాలలో బీసీ సెల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ఆఫీస్ ఆవరణలో మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయంతో పాటు అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికారం కోసం మహాత్మ జ్యోతిబాపూలే చూపిన మార్గం నేటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. నిజాం కళాశాలవైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ కవిత షిండే, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లాలోని రీడిప్లాయ్డ్ విఆర్వోల తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఇతర శాఖల్లో పాత సీనియారిటీ లెక్కించకపోవడం, అసలు చాలా శాఖల్లో సీనియారిటీ లిస్టులో విఆర్వోల పేర్లు చేర్చకపోవడం, ఇతర శాఖల్లో డిపార్ట్మెంట్ టెస్టులు పాస్ ప్రమోషన్‌కి అర్హత ఉన్నా కూడా పదోన్నతులు ఇవ్వడం లేదు తద్వారా సర్వీస్ పరంగా చాలా నష్టపోతున్న విషయం, ఇతర శాఖల్లో స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయకపోవడం లాంటి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది. సమస్యలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో రీడిప్లాయ్డ్ విఆర్వోల నాయకులు రాఘవేందర్ రావు, ముత్యాలు, శ్రీనివాస్, దయానంద్, వెంకటేష్,అజీజ్, మన్నెయ్య, రఘుపతి రెడ్డి, శైలజ, భార్గవి, కవిత, శ్రావణి, భాగ్యలక్ష్మి, శంకరయ్య, యాదయ్య, ఇతర విఆర్వోలు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సమక్షంలో శంకరయ్య సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామ నివాసి కొత్తకోట శంకరయ్య తన ఇద్దరు కుమారులు నాగేష్, మల్లేష్ తమ కనీస అవసరాలను చూడకుండా ఇంటి నుంచి బయటకి పంపించారు. ఈ విధంగా శంకరయ్య గత కొద్ది కాలంగా బంధువుల ఇళ్లలో నివాసం ఉంటు, ఇరుగుపొరుగు వారి సహాయంతో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా మేడ్చల్ మల్కాజిగిరి ఉమెన్ పోర్ట్ వైస్ ప్రెసిడెంట్ మౌనికని సంప్రదించి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా మౌనిక వెంటనే స్పందించి తన హ్యూమన్ రైట్స్ బృందంతో రంగంలోకి దిగి దుండిగల్ వార్డ్ కౌన్సిలర్ లు, వార్డు పెద్ద మనుషుల సమక్షంలో హైదరాబాద్ ఉమెన్ పోర్ట్ ప్రెసిడెంట్ సన, మహేష్‌లు ఇట్టి సమస్యను ఇరుపక్షాల పెద్ద మనుషులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.అనంతరం కొత్తకోట శంకరయ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా టీం కి, ప్రత్యేకంగా దారా మౌనిక, సన, దారా మహేష్ లకు ధన్యవాదాలు తెలియజేశారు.

రా మామిడి హారాల సేకరణలో అధితి రావ్ హైదరీ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : గార్లాండ్ - ఫెస్టివ్ 2024 సేకరణ నుండి రా మామిడి అప్సర కుర్తాలో అదితి రావ్ హైదరీ కనువిందు విలాస వంతమైన సిల్క్ శాటిన్‌తో రూపొందించబడిన, కుర్తా మౌర్య సామ్రాజ్యం దండలతో కూడిన విగ్రహాలను పునర్నిర్మించే క్లిష్టమైన ఎంబ్రాయిడరీని కలిగి ఉంది. క్యాస్కేడింగ్ జర్దోజీ, నక్షి, మోటీ మెటల్ సీక్వెన్స్ లోతైన వి-నెక్‌ను అందంగా ఆవరించి, గొప్ప ఆకృతిని పరిమాణాన్ని జోడిస్తుంది. గార్లాండ్ సేకరణ నుండి వర్గ పంత్‌తో జత చేయబడిందన్నారు. ఈ సమిష్టి సాంప్రదాయం, ఆధునికతను సంపూర్ణంగా మిళితం చేస్తుందన్నారు. ఇది పండుగ వేడుకలకు అనువైన ఎంపిక గార్లాండ్ సేకరణ దండలు, ఆశీర్వాదాల చిహ్నాలు, ప్రేమ పవిత్రమైన వాటి లోతైన సాంస్కృతిక ప్రాముఖ్యతను జరుపుకుంటుందన్నారు. పచ్చి మామిడి ఈ శక్తివంతమైన చిహ్నాన్ని స్కేల్ ఫారమ్ ద్వారా తిరిగి అర్థం చేసుకుంటుందన్నారు. పూల టోరన్‌లు, అల్లిన మాలాలు మౌర్య శిల్పం నుండి ప్రేరణ పొందిందన్నారు. బ్రోకేడ్ కాంట్రాస్ట్ కలర్ అప్లిక్యూపై సున్నితమైన ఎంబ్రాయిడరీ ద్వారా ప్రాధాన్యత ఇవ్వబడింది.

వారం రోజుల్లోగా సర్టిఫికెట్లు జారీ చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ఎన్జీవోస్, శిశు విహార్ సంరక్షణ కేంద్రాలలోని పిల్లలకు బర్త్, క్యాస్ట్, ఆర్ఫన్, ఆధార్ అఫ్డేషన్ ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లోగా జారీ చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్, జిహెచ్ఎంసి సీఎంఓ, ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్, డిసిపిఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 పిల్లల బర్త్, క్యాస్ట్, ఇన్ కం, ఆధార్ కార్డ్, ఆధార్ కార్డు అప్డేట్ మరియు ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కోసం 7 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారం రోజుల్లేగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యాంపు సందర్భంగా పిల్లలకు భోజనం, నీరు, వైద్య అవసరాలను కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిహెచ్ఎంసి సీఎంఓ డాక్టర్ పద్మజ, డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇంచార్జ్ డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డిఓ సాయిరాం, ఎస్ఇఎం జ్యోతి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, ఎన్జీవోలు బాలసదనముల అధ్యక్షులు, ఆధార్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సిటీ దిశగా రెండో దశ మెట్రో రైల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించి ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎల్ అండ్ టీ మెట్రో రైల్ అమీర్ పేట్ మెట్రో స్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎంఎల్, హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సంస్థ సహకారంతో మెట్రో రైల్ - హైదరాబాద్‌కి ఒక వరంగా ఆవిష్కృతమైందని అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ ఏడేళ్లలో ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో మెట్రో రైల్ ని అందుబాటులోకి తేగలిగామని ఆయన చెప్పారు. 90 లక్షల వాహనాలతో హైదరాబాద్ రవాణా విపరీతంగా పెరిగిపోయిందని, ఇటువంటి పరిస్థితుల్లో మెట్రో రైల్ ఒకటే ఈ సమస్యకు ప్రధానమైన పరిష్కారమని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. పాత నగరం మెట్రోకు ఇప్పటికే భూసేకరణ ప్రారంభమైందని ప్రాథమిక పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకు నిధులు కొరత ఉండబోదని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును విజయవంతంగా చేపట్టడానికి తగు ఆదేశాలు ఇచ్చారని ఆయన వెల్లడించారు. రెండవ దశ మెట్రోకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిన తర్వాత పెట్టుబడి పెట్టడానికి అనేక మల్టీ లేటరల్ డెవలప్మెంట్ బ్యాంకులు సుముఖత చూపిస్తున్నాయని ఆయన వెల్లడించారు. మెట్రో రెండవ దశ వల్ల హైదరాబాద్ ప్రపంచంలోనే ఉన్నత నగరాల సరసన చేరుతుందని, గ్లోబల్ సిటీగా మారబోతోందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడు సంవత్సరాల మెట్రో ప్రస్థానంలో ప్రజలకు గొప్ప సౌకర్యాలతో సేవలు అందించగలిగామని అన్నారు. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టుగా ఒక ప్రణాళికాబద్ధంగా మెట్రో రైళ్ల ఆపరేషన్‌ని మరింత సమర్థవంతంగా చేపట్టనున్నామని, కొత్త కోచ్‌లను తెప్పించే ప్రయత్నాన్ని ముమ్మరంగా చేస్తున్నామని వెల్లడించారు.

ఘనంగా శాంటా మారియా ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో శాంటా మారియా ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌కు హైదరాబాద్‌లోని కేంబ్రిడ్జ్ స్కూళ్ల విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫెస్టివల్‌లో చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్?షాప్‌లు జరిగాయి. ఇవి విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీశాయి. ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా ఆడారు. ఆసక్తికరంగా రేసులు, జట్టు ఆటలు, తల్లిదండ్రులు - విద్యార్థుల సవాళ్లు ఆకట్టుకున్నాయి. ఇవన్నీ టీమ్ వర్క్‌ను ప్రోత్సహించాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడానికి, పెంపొందించడానికి ఒక ప్రత్యేకమైన వేదికగా నిలిచింది. ముందుగా ఎంతో సంతోషంతో పైజామా పార్టీతో ప్రారంభించారు. విద్యార్థులు పాఠశాల నిద్రను అనుభవించారు. ఈవెనింగ్ అద్భుతమైన హౌస్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచారు. డీజే సంగీతంతో ఉత్సాహంగా నృత్యం చేశారు. సినిమా ప్రదర్శనను ఆస్వాదించారు. ఈ ఫెస్టివల్‌తో క్యాంపస్ అంతా సందడిగా మారిపోయింది. విద్యార్థులు ఎంతో ఆనందంగా గడిపారు. ఒకపక్క ఆటపాటలు, ఇంకో పక్క సృజనాత్మకతను వెలికి తీసే గేమ్స్‌తో విద్యార్థులలో నూతన ఉత్సాహం సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి తల్లి ప్రియాంక మల్లిక్ మాట్లాడుతూ ఫెస్టివల్ ఆఫ్ అమేజింగ్ లెర్నింగ్ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఈ ఉత్సవం కోసం వేచి చూస్తూ ఉంటామన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హేమా సంజయ్ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదల, తల్లిదండ్రుల భాగస్వామ్యం, అధ్యాపకుల ఉత్సాహం చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. మా స్కూల్ ప్రత్యేకతను ఈ కార్యక్రమం ఆవిష్కరించిందన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భూమండలంపై సర్వ జీవకోటికి ప్రాణాధారమైన గంగను ఒంటి కాలుపై కఠోరమైన తపస్సు చేసి దివి నుండి భువికి తీసుకువచ్చిన మహానుభావులు భగీరథ మహర్షి అని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం దోమడుగు గ్రామంలో స్థానిక పటాన్చెరు శాసనసభ్యులు గూడెపు మహిపాల్ రెడ్డి ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు గూడెపు మహిపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ భగీరథుని చరిత్ర నేటి సమాజానికి తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వేల సంవత్సరాల పాటు ఒంటి కాలుపై కఠోరమైన దీక్ష చేపట్టి పరమశివుని మెప్పించి గంగమ్మను దివి నుండి భువికి తీసుకువచ్చిన చరిత్ర భగీరథునిది అని అన్నారు. భగీరథుని వారసులుగా పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా సగరుల జీవితం నేడు కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భగీరథుని వంశమైన సగరులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆర్థికంగా రాజకీయంగా విద్య, ఉపాధి పరంగా అవకాశాలు సన్నగిల్లి అన్ని రంగాలలో వెనుకబాటుకు నెట్టివేయబడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సగరులను చైతన్యం చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి తమ న్యాయమైన డిమాండ్ ను సాధించుకుంటామని ఆయన అన్నారు. భగీరథుని విగ్రహాన్ని రాష్ట్ర రాజధాని హైదరాబాదు ట్యాంక్ బండ్ పై మహనీయుల సరసన ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంచినీటి పథకానికి మిషన్ భగీరథ అని నామకరణం చేసి చేతులు దులుపుకుంది తప్ప సగరులకు చేసిందేమీ లేదని శేఖర్ సగర ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని జిల్లాలలో ఇలాంటి విగ్రహాలను ఏర్పాటు చేసి తమ జాతిని మరింత చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. స్థానిక దోమడుగు సగర సంఘం అధ్యక్షులు ఆంజనేయులు సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రాజశేఖర్ సగర, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరి కిషన్ సగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రేఖబు మురళీకృష్ణ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య సగర, జిల్లా కోశాధికారి చిన్న అంజయ్య సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు డిండి శేఖర్ సగర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనం అంటే నూజివీడు సీడ్స్ విత్తనం

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ప్రజలకు అన్నం పెట్టే రైతు దేశానికి రాజు లాంటి వాడని సినీ జబర్దస్త నటుడు రాజమౌళి చెప్పారు. రోజుకు రైతు సమయంతో సంబంధం లేకుండా 24 గంటలు పొలంలోనే ఉంటాడని, చేను బాగోగులు దిగుబడి గురించే ఆలోచన చేస్తారు అన్నారు. మంచి విత్తనాలు వాడితే రైతు సోదరుల ఆదాయం పెరుగుతుందన్న జబర్దస్త రాజమౌళి, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ ఆవిష్కరించిన ఎన్ పి-9153 పుష్కల్ రకం వరి విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండలం బండవెలికిచెర్ల గ్రామంలో గురువారం నిర్వహించిన 'మెగా ఫీల్డ్ విజిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సినీ ఆర్టిస్ట్ మల్లిఖార్జునతో కలిసి, ఎన్ పి-9153 పుష్కల్ వరి విత్తనం పనితీరు, ప్రయోజనాలను స్కిట్‌ల రూపంలో రాజమౌళి ప్రదర్శించారు. కుల్కచెర్ల మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 450 మంది పైగా రైతు సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఎన్ పి-9153 పుష్కల్ రకం విత్తనాన్ని సాగు చేసిన పొలాలను ప్రత్యక్షంగా తిలకించారు. జబర్దస్త రాజమౌళి, మల్లిఖార్జున ప్రదర్శించిన స్కిట్‌లను ఆస్వాదించారు. ఈ ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. ముతక ధాన్యం పండించే రైతులు ఎన్ పి-9153 పుష్కల్ తో ఎక్కువ ఆదాయం ఆర్జించొచ్చని చెప్పారు. నూజివీడు సీడ్స్ టెరిటరీ సేల్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ బాల ప్రసాద్, మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్, ఇతర మార్కెటింగ్ సిబ్బంది, విత్తన పంపిణీదార్లు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-దుండిగల్: దైవచింతన తోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలోని మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్ తలారి యాదగిరి ముదిరాజ్ కుమారుడు తలారి మధుసూదన్ నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, బాలాజీ నాయక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, శంకర్ నాయక్, 27వ వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్ నాయక్, మునిసిపల్ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, నాయకులు సుధాకర్ రెడ్డి, విష్ణు యాదవ్, మహేందర్, అనీల్ కుమార్, శ్రీధర్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, సంగోళ్ల రమేష్, మల్లేష్, స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యేళ్లనాటి అలంపూరు నందికి జాతీయ స్థాయి గుర్తింపు

విశాలాంధ్ర- హైదరాబాద్ : జోగుళాంబ-గద్వాల జిల్లా, అలంపూరు పట్టణంలోని స్థానిక పురావస్తు ప్రదర్శన శాలలో గల అరుదైన నంది శిల్పం జాతీయ స్థాయి గుర్తింపుకు నోచుకొందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా. ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ 'భారతీయ ఇతిహాసం, చరిత్రలో నంది శిల్పం' అన్న అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సులో గురువారం ఆయన అలంపురం మ్యూజియంలోని, ఉమామహేశ్వర శిల్ప ఫలకంతో, క్రీ.శ.11వ శతాబ్దం నాటి, కందూరు చోళుల కాలానికి చెందిన, నల్ల శానపురాతిలో నగీషీగ చెక్కబడిన నంది శిల్పంపై పరిశోధనాత్మక పత్రాన్ని సమర్పించారు. ఇలాంటి శిల్పం భారతదేశంలోని మరే ప్రాంతంలోనూ వెలుగు చూడలేదని, అరుదైన ఈ శిల్పం, కళావిమర్శకులు, చరిత్రకారుల దృష్టికి తెచ్చినందుకు కర్నాటక చిత్రకళాపరిషత్‌కు చెందిన ఆచార్య రాఘవేంద్ర కులకర్ణి, చరిత్రకారులు శివనాగిరెడ్డిని అభినందించారు. సదస్సు ముగింపు సభలో నిర్వాహకులు ఆయనను శాలువా, జ్ఞాపికతో సత్కరించినట్లు తెలిపారు.

శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజ్‌గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి కర్క మోహన్ రెడ్డి సమక్షంలో లెక్కించగా 3,77,410 (మూడు లక్షల డెబ్బైఏడు వేల నాలుగు వందల పది రూపాయలు మాత్రమే) 63 రోజుల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎబి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణా ధికారి ఎబి రవీంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు ముదుంబై వేంకట రమణా చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు, కొండ పాక వేణుగోపాలా చార్యులు, క్లర్క్ సంద్రా సుధాకర్, ఆలయ మాజీ చైర్మన్ రామదాసు సంతోష్ ముదిరాజ్, మాజీ ధర్మ కర్తలు, గణేష్(కన్న) ఆలాపన, భక్తులు, రత్నమాల, రత్న మాణిక్యం, జయశ్రీ, లావణ్యఫాని కుమారి, సుబ్బారావు, బుచ్చిబాబు, పద్మజ, రామకృష్ణ, కె.వి.ఎస్ ప్రసాద్, గిరిధర్‌రావ్, కె పద్మ, కె.వి.ఎస్. నాగేశ్వర రావ్, సత్యవాణి, స్వరూప, మాధవి, ప్రభ, రేణుకా, వసంత, ఏ పద్మ, వరలక్ష్మి, ధనలక్ష్మి మంజుల, తనూజ, కృష్ణ రెడ్డి, అనుసుర్య, గాంధీ, ప్రతిభ, తదితర భక్తులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయ నిధి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి చింతల్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంజూరు చేయించిన దాదాపు 23 లక్షల రూపాయల విలువగల 61 మంది "సీఎం సహాయనిధి" చెక్కులను నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంజూరు చేయించిన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడంలో సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గౌరిష్, నిజాంపేట్ కార్పొరేటర్ గాజుల సుజాత, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు ఎత్తరి మారయ్య, అడ్వకేట్ కమలాకర్, కిషోర్ చారి, ఇస్మాయిల్, మహేష్, వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: అణచివేతకుగురెట్టన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ 'వీర్లపల్లి శంకర్' కొనియాడారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన మహాత్మ జ్యోతిబాపూలే 134వ వర్ధంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మార్కెట్ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పిఎసిఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, రఘు, బాలరాజ్ గౌడ్, ఆంజనేయులు, సత్యం రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు జాకారం చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు రాజు, మాజీ కౌన్సిలర్ విజయ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భార్గవ్ కుమార్ రెడ్డి, కొత్తపేట ఉస్మాన్, నలమోని శ్రీధర్, లింగారెడ్డిగూడెం అశోక్, రావుల పెంటయ్య, పసుల బుచ్చయ్య, శేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ జ్యోతిబాపూలే భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం, పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడారని ఆయన అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడన్నారు. బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూనాలో ప్రారంభించారని ఆయన వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడన్నారు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన దేశంలో మొట్టమొదటి జంటగా ఈ దంపతులు నిలిచారన్నారు. విద్య విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా జ్యోతిరావు పూలే, తద్వారా తన సమాజం అభివృద్ధి సాధ్యమని పూలే భావించారని అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మారని వారి ఆశయాల సాధనలో తాము కూడా ప్రయాణిస్తామన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : తహశీల్దార్

విశాలాంధ్ర - (మహబూబాబాద్) తొర్రూర్: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించాలని తొరూరు తాసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎంపీడీవో, సిహెచ్ నరసింహారావు, మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య లతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, తదితర సౌకర్యాలపై గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించి, విద్యార్థుల ప్రాణం మీదికి తేవద్దని ఉపాధ్యాయులను కోరారు. మంచి విద్య కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రకటించిన మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలతో విద్యార్థులకు భోజనాన్ని అందించాలని వారు తెలిపారు. వేల సంఖ్యలో ముఖ్యమంత్రి విద్యారంగం పట్ల చిత్తశుద్ధితో పని చేస్తూ నూతన ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. అదేవిధంగా మెస్ చార్జీలు కూడా పెంచడం జరిగిందని, చిన్న చిన్న పొరపాట్ల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, కావున ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన ఉపాధ్యాయుడిని అభినందించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ 2024 కు ఎంపికైన ఉపాధ్యాయుడు దూసి కౌండిన్యను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం వాణీ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు దూసి కౌండిన్య కేంద్ర ప్రభుత్వ శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వ శాఖతో పాటు అనుబంధ మంత్రిత్వ శాఖలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐ.ఐ.ఎస్.ఎఫ్) 2024కు ఉపన్యాసకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయున్ని అభినందించారు. ఐఐటి గౌహతిలో నవంబర్ 30 నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు జరిగే ఈ ఫెస్టివల్‌లో "సైన్స్ ఎ రౌండ్ అజ్" అనే అంశంపై కౌండిన్య ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొను ఉపన్యాసకులలో దక్షిణ భారతదేశం నుండి, ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపాధ్యాయుడు మన జిల్లాకు చెందిన వాడు కావడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం ఆయన మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలంలోని నాగారం పి.పి.సి, కన్నాల పి.పి.సి, గుంజపడుగు పి.పి. సి, జడ్పీ హెచ్ఎస్ స్కూల్, చిల్లపల్లి ఐ.కే.పి. గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతం 17 రాగానే వెంటనే కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైస్ మిల్లుల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు లేకుండా చూడాలని అన్నారు. గుంజపడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యమైన పదార్థాలు మాత్రమే వాడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో ఉన్న సరుకులను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు అందించే ఆహారం నాణ్యతతో ఉండాలని, పాఠశాలకు సరుకులు వచ్చే సమయంలో నాణ్యతను పరిశీలించి స్వీకరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. అగ్రికల్చర్ ఏ.డి.అంజనీ, సిబ్బంది నరేష్, పద్మ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం వినాశకరం

ఏఐఎస్ఎఫ్ మహాసభలో దినేశ్ నటరాజన్ విమర్శ

విశాలాంధ్ర- విజయనగరం: మోదీ సర్కారు తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి దినేశ్ రంగరాజన్ పిలుపునిచ్చారు. ఎన్ఈపీ విధానాన్ని కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే వ్యతిరేకించాయని తెలిపారు. ఈ విధానం దేశానికి అతిపెద్ద ప్రమాదకరమని హెచ్చరించారు. దీనిపై అనేకసార్లు చర్చలు జరిపినా అన్ని రాష్ట్రాలు వ్యతిరేకించాయన్నారు. పట్టణంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండోరోజు గురువారం జరిగిన ప్రతినిధులసభలో దినేశ్ రంగరాజన్ మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అధ్యక్షత వహించారు. దినేశ్ మాట్లాడుతూ సనాతన విద్య అమలు చేయాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు అదానీ, అంబానీ చెప్పినట్లు పాలన చేస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగ అవకాశాలు లేక అనేకమంది విద్యావంతులు డెలివరీ బాయ్‌లుగా జీవిస్తున్నారని, మరికొందరు చదువు కోసం తీసుకున్న రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ వలన రాష్ట్రాలలో చదువుతున్న రాష్ట్ర సిలబస్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే కాకుండా సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలోనూ, దేశంలో కార్పొరేట్ శక్తులు పాలన సాగిస్తున్నాయని, అన్ని రంగాలతోపాటు విద్యారంగాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నాయని విమర్శించారు. విద్యార్థి సంఘాలలో సైతం తమ మోసపూరిత మాటలతో విషబీజాలు నాటుతున్నాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని, ప్రైవేటు శక్తులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. విద్య సామాన్యుడికి అందని ద్రాక్షగా మారుతోందన్నారు. నేటికీ ఆరు కోట్లమంది బాలకార్మికులుగా జీవిస్తున్నారని తెలిపారు. 46 శాతం ప్రజలు దేశంలో నిరక్షరాస్యులుగానే ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్థితిలో పాలకులు ఉన్నారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు మాత్రం యధేచ్ఛగా దోచి పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన ప్రగతి నివేదికతోపాటు నిర్మాణాత్మక అంశాలపై రాష్ట్ర కమిటీ నివేదిక ఇచ్చింది. సభకు దాదాపు 600 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. శివారెడ్డి రాష్ట్ర కమిటీ నివేదిక చదివి వినిపించారు. అనారోగ్యంతో మహాసభలకు హాజరు కాలేకపోయిన కేరళ రెవెన్యూ మంత్రి పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు.

సుప్రీంకోర్టు నిర్ణయం సరైనదే

'సామ్యవాదం, లౌకికవాదం' పిటిషన్ కొట్టివేతపై నారాయణ

న్యూఢిల్లీ: రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం)' పదాలను తొలగించాలన్న పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేయడాన్ని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ స్వాగతించారు. 1976లో అంటే దాదాపు 48ఏళ్ల కిందట రాజ్యాంగంలో పొందుపర్చిన ఈ పదాల తొలగింపునకు డిమాండ్ చేయడం అర్థరహితమని ఆయన గురువారం ఒక ప్రకటన చేశారు. చట్టానికి అంతా సమానం తరహా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో ఏకీభవించే 'సామ్యవాదం' పదంపై న్యాయ నిపుణుల వాదనలకు నారాయణ మద్దతు ప్రకటించారు. నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛ ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని పార్లమెంటు సవరించవచ్చు కానీ దాని ప్రాథమిక ఉద్దేశాన్ని దెబ్బతీయరాదని నారాయణ అన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని సంఘ్ పరివార్ కోరుకుంటోందని చెప్పారు. అధికరణలు 14, 15, 16 కింద మతం పేరిట పౌరులపై వివక్షకు అనుమతి లేదని గుర్తుచేశారు. అందరు పౌరులకు మత స్వేచ్ఛను ఆర్టికల్ 24 కల్పిస్తోందన్నారు. 'సామ్యవాదం' సంక్షేమానికి భాష్యం చెబుతుందని, సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్ష, దోపిడీకి చోటు లేని గణతంత్రానికి సూచికగా ఉంటుందన్నారు. సామ్యవాదం, లౌకికవాదం పదాలను రాజ్యాంగంలో నుంచి తొలగిస్తే... దాని ప్రాథమిక ఉద్దేశం దెబ్బతింటుందని నారాయణ నొక్కి చెప్పారు. సంబంధిత పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం సముచితమని, ఈ రెండు పదాల తొలగింపు కోసం పట్టుబట్టడాన్ని సంఘ్ పరివార్ మానేయాలని నారాయణ హితవు పలికారు.

'టిడ్కో' అక్రమాలపై విచారణ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లల్లో జరిగిన అవకతవకల ఆరోపణలపై గురువారం రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు ఉన్నతాధికారులతో విచారణ కమిటీని నియమించింది. పురపాలకశాఖ పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టర్, మెప్మా మిషన్ డైరెక్టర్, ఏపీ టిడ్కో ఎండీలు ఈ కమిటీలో ఉంటారు. నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. 2019-24 మధ్య టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితా మార్పివేత ఆరోపణలపై విచారించాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. 2017-19లో ఎంపిక చేసిన లబ్ధిదారులను మార్చేసి.. 2019-24లో కొత్త వారిని జాబితాలో చేర్చడంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద లబ్ధిదారుల డీడీలను బ్యాంకుల్లో సమర్పించకపోవడంపైనా విచారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టిడ్కో ఇళ్ల అవకతవకలపై విచారిస్తామని ఇటీవల అసెంబ్లీలో పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రకటించిన విషయం విదితమే.

శ్రీశైలం జలాశయంలో తగ్గుతున్న నీటి నిల్వ

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 215 టీఎంసీల నుంచి 131.25 టీఎంసీలకు తగ్గిపోయాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 869.73 అడుగులు. కుడి గట్టులో ఏపీ విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినా తెలంగాణ మాత్రం విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి కోసం 35,315 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు. ఈ ఏడాది వందలాది టీఎంసీల నీరు ఎగువ నుండి రావడంతో ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం వలన అవి సముద్రంలో కలిసి పోయాయి. వరదలు వచ్చినప్పుడు జలాశయంతోపాటు ఎగువన నీటిని నిలువ చేసుకునేందుకు ఎటువంటి ప్రాజెక్టులు లేకపోవడంతో నీరు వృథా అయింది. ప్రస్తుతం శ్రీశైలం పరివాహక ప్రాంతంలో ఎటువంటి వరద లేకపోవడంతో జలాశయానికి చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు రావడం లేదు. ఇక ప్రాజెక్టులో ఉన్న నీటిని విద్యుత్ వినియోగానికి ఉపయోగించడం వల్ల నీటి నిల్వ తగ్గిపోతోంది. శీతాకాలంలోనే ప్రాజెక్టులో నీటి నిల్వ 215 టీఎంసీల నుండి 131.25 టీఎంసీలకు పడిపోతే వేసవిలో తాగునీటి పరిస్థితి ఏమిటని సాగునీటి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. వేసవిలో కర్నూలు పశ్చిమ ప్రాంతంలో ప్రజలు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఇటువంటి వారికి హంద్రీనీవా లాంటి ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందించే అవకాశం ఉంది. అలాగే కర్నూలు జిల్లాలో హంద్రీనీవా నీటితో చెరువులు నింపితే ఆయాప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందుల నుండి గట్టెక్కే అవకాశం ఉంది.ప్రాజెక్టు అధి కారులు ముందు చూపులేకుంటే వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

వక్ఫ్ కమిటీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై సంయుక్త కమిటీకి ఇచ్చిన గడువు పొడిగించారు. వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ముగింపు వరకు గడువు ఇచ్చే విధంగా ప్రతిపాదించిన తీర్మానాన్ని దిగువసభ ఆమోదించింది. కమిటీ చైర్మన్, బీజేపీ నేత జగదాంబిక పాల్ ఈ మేరకు తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా మూజువాణి ఓటు ద్వారా సభ్యులు ఆమోదం తెలిపారు. పార్లమెంటరీ ప్యానల్ సమావేశాలన్నవి అధికార-విపక్షాలకు వర్చువల్ యుద్ధ క్షేత్రాలుగా మారిపోయాయి. వక్ఫ్ బిల్లుకు ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలపై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు బుధవారం వాకౌట్ చేశారు. ప్యానల్ ముసాయిదా నివేదిక సిద్ధంగా ఉన్నదని పాల్ చెప్పడాన్ని ఆక్షేపించారు. ఈనెల 29వ తేదీతో నివేదిక ఇచ్చేందుకు గడువు ముగుస్తోంది కాబట్టి పొడిగింపు కోరాలని కమిటీ భావిస్తున్నట్లు విపక్ష సభ్యులకు పాల్‌తో సహా కమిటీలోని బీజేపీ సభ్యులు తెలిపారు. ఆగస్టు 8న ఈ కమిటీని లోక్‌సభ ఏర్పాటు చేసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల మొదటి వారంతానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఇదే క్రమంలో గురువారం కమిటీకిచ్చిన గడువును లోక్‌సభ పొడిగించింది.

ఆర్జీవీ పిటిషన్‌పై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఇకపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా ఆదేశించాలని కోరుతూ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని, విచారణను వాయిదా వేయాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. ఒకే అంశంపై అనేకచోట్ల కేసులు పెడుతున్నారంటూ రాంగోపాల్ వర్మ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. మరోపక్క ఆర్జీవీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. నెల రోజుల క్రితం ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో ఆర్జీవీపై కేసు నమోదైంది. ఆ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ ఒంగోలు రూరల్ పోలీసులు తొలుత హైదరాబాద్‌లోని ఆర్జీవీ కార్యాలయంలో నోటీసులు అందజేశారు. ఆ తరువాత ఈ నెల 19వ తేదీన ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉండగా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు తిరస్కరించడంతో వారం రోజుల సమయం కావాలంటూ దర్యాప్తు అధికారికి వాట్సాప్ ద్వారా ఆర్జీవీ సందేశం పంపించారు. అనంతరం ఈ నెల 25వ తేదీన విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు మరోసారి నోటీసులు పంపారు.

విజయబాబుకు రూ.50 వేల జరిమానా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు విజయబాబుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయబాబుకు రూ.50 వేల జరిమానా విధించింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న సామాజిక కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని విజయబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం... రాజకీయ ఉద్దేశంతోనే విజయబాబు పిటిషన్ వేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నెల రోజుల్లో లీగల్ సర్వీసు అథారిటీలో రూ.50 వేలు చెల్లించాలని విజయబాబును ఆదేశించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం ఉద్దేశాలను విస్మరించారని పిటిషనర్‌ను హెచ్చరించింది. కిరాయి మూకలుగా పనిచేస్తూ సోషల్ మీడియాను దుర్వినియోగపరుస్తున్న వారిపై చర్యలు తీసుకోవల్సిందేనని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతున్నవారికి మద్దతుగా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ హక్కులు తెలుసుకోకుండానే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారు ఖరీదైన ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తున్నారని, వారి తరఫున పిటిషన్ వేయాల్సిన అవసరం ఏముందని కోర్టు ప్రశ్నించింది. సమాజంలో తమ బాధ చెప్పుకోలేనివారి కోసం వేయాల్సిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని రాజకీయ దురుద్దేశంతో వేశారని కోర్టు అభిప్రాయపడుతూ విజయబాబు పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. విజయబాబుకు విధించిన జరిమానాను అంధులు, బధిరుల సంక్షేమం కోసం వినియోగించాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

ఉక్రెయిన్‌లో అంధకారం

పవర్ గ్రిడ్ లక్ష్యంగా రష్యా దాడులు

కీవ్: ఉక్రెయిన్ అంధకారమైంది. పవర్ గ్రిడ్ లక్ష్యంగా రష్యా మళ్లీ దాడి చేసింది. 200 క్షిపణులు, డ్రోన్లతో దాడుల క్రమంలో లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉక్రెయిన్ పవర్ గ్రిడ్‌లపై రష్యా దాడి చేయడం రెండు వారాల్లో ఇది రెండోసారి కాగా.. ఈ ఏడాదిలో 11వసారి. దేశమంతటా విద్యుత్ కేంద్రాలపై దాడులు జరుగుతున్నాయని ఉక్రెయిన్ విద్యుత్ వ్యవహారాల శాఖ మంత్రి హెర్మన్ హాలుష్‌చెంకో పేర్కొన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు తమ ఇంజినీర్లు కృషి చేస్తున్నారని, సాధ్యమైనన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. శీతాకాలంలో ఉక్రెయిన్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతాయి. దాంతో తాగునీరు, వేడి వాతావరణం కోసం విద్యుత్ కీలకం. ఇదిలావుంటే గురువారం ఒక్కరోజే 100 డ్రోన్లు, 90 క్షిపణులతో ఉక్రెయిన్‌లోని 17లక్ష్యాలపై తమ సైన్యం దాడి చేసినట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు.

రైతు సేవా కేంద్రాల్లో పంట విక్రయం

24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ: నాదెండ్ల

విశాలాంధ్ర-గుడివాడ: రైతు సేవా కేంద్రాల ద్వారా పంట విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజాతో కలసి నియోజకవర్గంలోని బొమ్ములూరు, గుడ్లవల్లేరు గ్రామాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం రాశులను పరిశీలించి ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. తేమ సాకుతో మిల్లర్లు ధరలో కోత విధిస్తున్నారని, తాము ఎంతో నష్టపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం విక్రయంలో తలెత్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి సమస్య ఉన్నా తనను ఫోన్లో నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. 24 గంటల లోపే నగదు రైతు ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం గతంలో ఉన్న 17శాతం తేమ నిబంధనను కొంతమేర సడలించామని, ఐదు కేజీల తరుగుతో 24 శాతం వరకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. జీపీఎస్ వ్యవస్థ లేకపోయినా లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణాకు అవకాశం కల్పించామని, జిల్లా పరిధి దాటి కూడా వాహనాలను ఉపయోగించుకోవచ్చన్నారు. మిల్లర్లు సైతం గతంలో బ్యాంకు గ్యారంటీ చెల్లించలేదని, వారికి 1:2 నిష్పత్తిలో వెసులుబాటు కల్పించామన్నారు. దళారులకు పంట అమ్మి నష్టపోవద్దని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్.పద్మావతి, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి వి.పార్వతి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ సృజన, యలవర్తి శ్రీనివాసరావు, వాసే మురళీ, బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ ఈయూతో అధికారుల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీతో శుక్రవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల(ఈడీ) సమావేశం కానుందని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న పీటీడీ ఉద్యోగులకు అటు ప్రభుత్వం వద్ద, ఇటు ఆర్టీసీ యాజమాన్యం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే క్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం మేరకు ఈనెల 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద ధర్నాలు చేయాలనుకున్నాం కానీ చర్చలకు రావాలని రవాణా మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆహ్వానించారు. దీంతో ఆందోళనలు విరమించాం' అని నాయకులు తెలిపారు. ఆర్టీసీ హౌస్‌లో యూనియన్ రాష్ట్ర కమిటీతో సమావేశమవుతున్నట్లు చెప్పారు. పీటీడీ ఉద్యోగుల సమస్యలతోపాటు కింది స్థాయి అధికారుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామని వెల్లడించారు.

కిలకిలరావాల విందు!

- పక్షి ప్రేమికులను కట్టిపడేస్తున్న విహంగాల విన్యాసాలు
- పరవశించిపోతున్న పిన్నలు, పెద్దలు
- సందర్శకులను ఆకట్టుకుంటున్న 'నేలపట్టు'

విదేశీ విహంగాల విన్యాసాలు పక్షి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. కిలకిలరావాలు కనువిందు చేస్తున్నాయి. నిత్యం వందలాది మంది యాత్రికులు నేలపట్టు కేంద్రానికి విచ్చేస్తూ ఆహ్లాదాన్ని అనుభవిస్తున్నారు. చిన్నారులతో కలిసి బైనాక్యులర్లతో చూస్తూ కేరింతలు కొడుతున్నారు. వివిధ రకాల రంగురంగుల విదేశీ పక్షులను చూస్తూ పరవశించిపోతున్నారు. పక్షులకు రారాజుగా పిలవబడే గూడబాతును చూస్తూ ఎగిరిగంతేస్తున్నారు. ముక్కు కింద గూడసంచిని చూసి గొప్ప అనుభూతి పొందుతున్నారు. తెడ్డుముక్కు... స్వాతిముక్కు కొంగలు, సూదితోక బాతులను తనివితీరా చూస్తూ అంతులేని ఆనందాన్ని అనుభవిస్తున్నారు. పక్షులు జతకట్టి జర్రున పైకి ఎగరడాన్ని కని ముచ్చటపడుతున్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంతో యాత్రికులు సంబరపడిపోతున్నారు.

ఆసియా ఖండంలోనే విదేశీ పక్షుల సంతానోత్పత్తికి తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం పేరుగాంచింది. ప్రతి ఏడాది అక్టోబరు మొదలు ఏప్రిల్ వరకు వివిధ దేశాల నుంచి వేలాది విహంగాలు జతకట్టి గూళ్లు నిర్మించుకుని గుడ్లు పెట్టి సంతానోత్పత్తి పొంది తిరిగి ఆయా దేశాలకు తిరిగి వెళ్లాపోవడం ఆనవాయితీ. నైజీరియా, బర్మా, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయ్‌లాండ్, ఆఫ్ఘనిస్థాన్, కజకిస్తాన్, ఆస్ట్రేలియా తదితర దేశాలు నుంచి గూడబాతులు, నత్తగులకొంగలు, తెల్లకంకణాలు, నీటి కాకులు, తెడ్డుముక్కు కొంగలు, సూదితోక బాతులు, స్వాతిముక్కు కొంగలు తదితర జాతులకు చెందిన వలస పక్షులు సంతానోత్పత్తి కోసం అక్టోబరులో ఈ కేంద్రానికి వచ్చి ఏడు నెలలుపాటు విడిది చేసి గుడ్లు పెట్టి ... పొదిగి పిల్లలతో తిరిగి ఆయా దేశాలకు తిరిగి వెళ్లిపోతుంటాయి. తొలుత నేలపట్టు చెరువులో ఉన్న కరప చెట్లపై గూళ్లను నిర్మించుకుంటాయి. విహంగాల కిలకిలరావాలకు ... యాత్రికులు తోడుకావడంతో పక్షుల కేంద్రం చిన్నపిల్లల కేరింతలతో మారుమోగుతుంది. వర్షాలు ప్రారంభంకాగానే ఇక్కడి వాతావరణ పరిస్థితులను ముందుగానే పైలెట్ పక్షులు పసికడతాయి. ఆకాశంలో చక్కలు కొట్టి అనువైన ప్రదేశంగా భావిస్తాయి. ఆ తరువాత మరో పక్షితో జతకట్టి విడిది చేస్తాయి. ఈ పక్షులు వస్తే ... వర్షాలు కురుస్తాయనేది చుట్టు పక్కల గ్రామాల ప్రజల మూఢ నమ్మకం. అందుకే వీటిని దేవతా పక్షులుగా పిలుస్తారు. 18 రకాల పక్షులు వివిధ దేశాల నుంచి ఇక్కడకి వచ్చి సంతానోత్పత్తి పొందుతాయి. విహంగాల్లో అతి పెద్ద పక్షి గూడబాతు. దీనిని నేలపట్టు రారాజుగా పిలుస్తారు. సుమారు 10 నుంచి 15 కేజీల బరువు ఉంటుంది. ఈ పక్షికి పొడవైనా గూడసంచి ముక్కు కింద ఉంటుంది. దీనిలో సుమారు నాలుగు నుంచి ఐదు కేజీల వరకు చేపలు, నత్తలు, గుల్లలు, తదితర ఆహారపదార్థాలను సుమారు 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీహరికోట సమీపంలోని పులికాట్ సరస్సుకు వెళ్లి అక్కడ వేటాడి తీసుకువస్తాయి. వీటిని పిల్లలకు ఆహారంగా అందిస్తాయి. ఈ నేలపట్టు పక్షుల కేంద్రానికి తమిళనాడు, కర్నాటక, హైదరాబాద్ తదితర రాష్ట్రాలు నుంచే కాకుండా చైనా, అమెరికా, రష్యా తదితర దేశాలు నుంచి పక్షి ప్రేమికులు నేలపట్టు వస్తారు. విహంగాల విన్యాసాలను దగ్గర నుంచి వీక్షిస్తారు. ఇదే కేంద్రంలో ఉన్న జింకలపార్క్, రామచిలుకల నిలయాలు, సందర్శశాల, ఫిల్మ్‌షో, చిల్డ్రన్‌పార్క్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. విహంగాలను బైనాక్యులర్స్ ద్వారా చూస్తూ కేరింతలు కొడుతున్నారు. ఇదిలా ఉండగా, ఐదేళ్లుగా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయడం లేదు. ఈ ఏడాడి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ... ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన్నట్లు సమాచారం.కాగా, పక్షుల కేంద్రంలో 7,841 విదేశీ, స్వదేశీ విహంగాలు జత కట్టి 2,938 గూళ్లు నిర్మించిన్నట్లు ఫారెస్ట్ రేంజర్ సరోజిని తెలిపారు. ఇప్పటికే 18 రకాల పక్షులు చెరువులో కరప చెట్లుపై జతకట్టినట్టు వివరించారు.

\- తాతంశెట్టి చంద్రకుమార్-దొరవారిసత్రం

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.